Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి :1 సంచిక : 104 హైదరాబాద్ బుధవారం 27 -12 - 2023 పేజీలు : 8 రూ.4






## సీఎం హోదాలో తొలిసారి


# ప్రధానిని కలిసిన రేవంత్..

### - మోదీ ముందుంచిన విన్నపాలివే..

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ఈయనతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా ఉన్నారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పలు సంక్షేమ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇక కేంద్రం నుంచి రావల్సిన నిధులు, పాత బకాయిలు, పెండింగ్ లో ఉన్న బిల్లులపై చర్చించారు. రేవంత్ రెడ్డి చెప్పిన వాటిని తప్పకుండా అమలు చేస్తామని మోదీ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.విభజన హామీకి సంబంధించిన పెండింగ్ నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల మంజూరు కోసం కేంద్రాన్ని అభ్యర్థించారు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర పురోగతికి అవసరమైన విన్నపాల జాబితా పట్టుకుని రేవంత్, విక్రమార్క ఢిల్లీకి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్రానికి రావాల్సిన వివిధ రకాల గ్రాంట్లు, పెండింగ్ నిధుల గురించి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద రాష్ట్రానికి నిధులు రావాల్సి ఉంది. ఈ పథకం కింద హైదరాబాద్ మినహా అప్పటి ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు 50 కోట్ల చొప్పున 450 కోట్లు రావాల్సి ఉంది. గత మూడేళ్లకు సంబంధించి 1,350 కోట్ల రూపాయల గ్రాంటు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలని ప్రధాని మోదీని, సీఎం రేవంత్ కోరినట్లు తెలుస్తోంది.అలాగే కృష్ణా జలాల పంపకాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న క్రమంలో అటు ఏపీ, ఇటు తెలంగాణ పోలీసులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద భారీగా మోహించారు. ఏపీ పరిధిలో ఉన్న గేట్లకు కంచె ఏర్పాటు చేశారు. తమ నీళ్లను తాము వినియోగించుకుంటున్నామని చెప్పారు అక్కడి ఇరిగేషన్ అధికారులు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి స్పందిస్తూ రాబోయేది తమ ప్రభుత్వం అని నీటి పంపకాలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులతో కూర్చొని చర్చించుకుంటామన్నారు.దీనిపై వెంటనే కమిటీ వేసి నీటి పంపకాలు జరపాలని ప్రధానిని కోరినట్లు తెలుస్తోంది. దీంతో పాటూ ఎన్నికలకు ముందు మోదీ తెలంగాణ వచ్చినప్పుడు గిరిజన వర్సిటీ, పసుపుబోర్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. మేడారం జాతరను నేషనల్ ఫెస్టివల్‌గా గుర్తిస్తున్నామన్నారు. త్వరితగతిన వీటి ఏర్పాటుతో పాటు వివిధ పథకాల కింద తెలంగాణ ప్రభుత్వానికి రావాల్సిన నిధులపై మోదీతో చర్చించారని సమాచారం. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్న అంశాలన్నీ విన్న ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

# నేడే సింగరేణిలో ఎన్నికలు

### - సర్వం సిద్ధం చేసిన అధికారులు




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** సింగరేణి ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. తెలంగాణలోని ఆరు జిల్లాల పరిధిలో కొల్ బెల్ట్ ఏరియాలో హెూరాహెూరిగా ప్రచారం ముగిసింది. చివరి రోజు ప్రచారంలో హేమహేమి నాయకులు పాల్గొన్నారు. కార్మికుల ఓట్లను అకట్టు కోవడానికి అధికార పార్టీ మంత్రులు సింగరేణి కార్మికులకు పలు వరాలను ప్రకటించి తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం జరిగే పోలింగ్ కు సింగరేణి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్తర తెలంగాణలో గోదావరి తీరం లోని ఆరు జిల్లాల పరిధిలో 11 ఏరియాలో ఈ ఎన్నికల పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 27న అంటే రేపే పోలింగ్. 13 కార్మిక సంఘాలు బరిలో ఉన్నాయి. దాదాపు 40 వేల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఈ సంస్థలో ఇప్పటి వరకు ఆరు పర్యాయాలు ఎన్నికలు జరుగగా వీటిలో అత్యధికంగా సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఎఐటియుసి మూడు సార్లు, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి ఓసారి, బిఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రెండు సార్లు విజయం సాధించాయి.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాలుగు ఏరియా ల్లో 23 పోలింగ్ స్టేషన్లు, నాలుగు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు..7వేల 476 మంది ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. అటు .మంచి ర్యాల, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని

వివరాలు 2లో


## లోక్‌సభ బరిలో తమిళిసై..

# తెలంగాణకు కొత్త గవర్నర్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నిక లపై చర్చ జరుగుతోంది. షెడ్యూ కంటే ముందే ఎన్నికలు రావొచ్చేనే అభిప్రాయాన్ని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తు న్నారు. దీంతో అన్ని పార్టీల నేతలు గ్రౌండ్ వర్క్ స్టార్ చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ లోక్ సభ ఎన్నికలపై ఫోకస్ పెట్టాయి. ఈనెల 28న బీజేపీ అగ్రనేత, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కూడా రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణలో బీజేపీ 10 సీట్లు టార్గెట్ పెట్టుకోగా.. అందుకు అనుగుణంగా అమిత్ షా నేతలకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతుంది. తెలంగాణ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న తమిళిసై సౌందరరాజన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి ఆమె పోటీ చేసేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇవాళ గవర్నర్ ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈ పర్యటనలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. తన ఎంపీ అభ్యర్థిత్వంపై ఆమె అమిత్ షాను కోరను న్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని సౌత్ చెన్నై లేదా తిరునల్వేలి నుంచి పోటీకి ఆమె రెడీ అయినట్లు తెలుస్తోంది.తమిళిసై గతంలో రెండు సార్లు ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో చెన్నై నార్త్, 2019లో తూత్తూకూడి నుంచి ఎంపీగా పోటీ చేసి పరాజయం చవి చూశారు. మరో మూడు పర్యాయాలు అసెంబ్లీకి పోటీ చేసినా.. ఆమె గెలుపు తలుపు తట్టలేదు. పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. 2021 నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్య తలు అప్పగించారు.అయితే రాజ్యాంగబద్ధమైన పదవిని వదిలి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆమె భావిస్తున్నారట. ఈ నేపథ్య ంలో లోక్ సభకు పోటీ చేసేందుకు గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకు ంటున్నట్లు తెలుస్తోంది. ఎంపీగా పోటీ చేసేందుకు తమిళిసైకి ప్రధాని మోదీ, అమిత్ షా గ్రీన్ సిగ్నల్ ఇస్తే వచ్చే నెలలో రాష్ట్రానికి కొత్త గవర్నర్‌ను కేంద్రం నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. జనవరిలో రాష్ట్ర గవర్నర్ మార్పు ఖాయమంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఎవరిని గవర్నర్‌గా నియమిస్తారనేది చర్చనీయాంశమైంది. బీజేపీకి చెందిన వ్యక్తిని నియమిస్తారా? లేక పార్టీలకు సంబంధం లేని రిటైర్డ్ అధికారులు, రిటైర్డ్ జడ్జిలను నియమిస్తారా? అనేది హాట్ టాఫిక్‌గా మారింది.


# కొత్త రేషన్ కార్డుల జారీ.. మంత్రి శ్రీధర్ బాబు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** ప్రామాణికమని ప్రభుత్వం ప్రకటించటం గమనార్హం. అయితే.. గత సర్కారు హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవటంతో.. చాలా మంది ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలా అని చూస్తున్నారు. కాగా.. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కొత్త రేషన్ కార్డుల అప్లికేషన్లు మొదలయ్యాయని.. గైడ్ లైన్స్ ఇవేనని.. దరఖాస్తుకు చివరి తేదీ ఇదేనంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రి శ్రీధర్ కీలక ప్రకటన చేశారు.జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజా పాలన నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు.. కొత్త రేషన్ కార్డుల విషయంపై క్లారిటీ ఇచ్చారు. రేషన్ కార్డుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నట్టు.. కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, పాత కార్డులను తీసేయడం వంటి ప్రక్రియను ప్రభుత్వం చేపట్టలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపడుతుందన్నారు. అయితే.. కొత్త రేషన్ కార్డుల జారీకి ఇంకా విధి విధానాలు ఖరారు కాలేదని.. లబ్ధిదారుల ఎంపికకు ఇంకా గైడ్ లైన్స్ సిద్ధం కాలేదని మంత్రి పేర్కొన్నారు.డిసెంబర్ 28 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పిన విషయంపై కూడా మంత్రి క్లారిటీ ఇచ్చారు. ఆశావహుల డేటా సేకరణ కోసమే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఫించన్ వస్తున్న వాళ్లు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలనుకునే వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని.. అప్లికేషన్లలో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజా పాలనలో స్వీకరించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుకు కసరత్తు చేస్తోంది. అయితే.. ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈ నెల 28 నుంచి ప్రజా పాలన పేరుతో గ్రామ సభలు నిర్వహించనుంది. అయితే.. ఆ ఆరు గ్యారెంటీల ద్వారా లబ్ది పొందేందుకు రేషన్ కార్డులే.

## సీఎం కొత్త క్యాంపు కార్యాలయం...

# మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** సీఎం కొత్త క్యాంపు కార్యాలయం... మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొత్త క్యాంపు కార్యాలయం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సుమారు 12 వేల చదరపు అడుగుల్లో ఈ నిర్మాణాన్ని చేపట్టేందుకు భూమిపూజ కూడా నిర్వహించారు. గతంలో సీఎం క్యాంపు కార్యాలయం, అధికారిక నివాసంగా ఉన్న ప్రగతిభవన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పేరు మార్చిన సంగతి తెలిసిందే. జ్యోతి బాపులే ప్రజాభవన్‌గా పేరుమార్చి.. దాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అధికారిక నివాసంగా కేటాయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాంపు కార్యాలయంగా వినియోగిం చుకునేందుకు మరో భవనం అవసరమని అధికారులు గుర్తించారు. దీంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలోని బ్యాడ్మింటన్ కోర్టు సమీపంలో అతిథిగృహన్ని నిర్మించాలని

వివరాలు 2లో

## నేడు సింగరేణిలో ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

31 పోలింగ్ కేంద్రాల్లో 14వేల 985 మంది ఓటు హక్కు వినియోగించుకొనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్.. ఏడు గంటల నుంచి కౌంటింగ్ జరగనుంది.ఏడో పర్యాయం జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి తో పాటు బీఆర్ఎస్ అనుబంధ సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఎఐటియుసి సంఘంతో పాటు మరో పది కార్మిక సంఘాలు గుర్తింపు హోదా కోసం పోటీ పడుతున్నాయి. సిఐటియు, బిఎంఎస్, హెచ్ఎంఎస్ జాతీయ సంఘాలు కూడా పోటీలో ఉండి తమ ఉనికిని కాపాడు కోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

## సీఎం కొత్త క్యాంపు కార్యాలయం... మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ప్రతిపాదించారు. పెద్దగా ఖర్చు లేకుండా దీన్ని నిర్మించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. ఆ ప్రాంతాల ప్రజ లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వెనక వైపు ఉన్న గేటు నుంచి రాకపోకలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది.సీఎం క్యాంపు కార్యాలయ భవనాన్ని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుగా నిర్మించనునట్లు తెలిసింది. అందుకు సంబంధించిన రెండు, మూడు నిర్మాణ ప్రణాళికలను అధికారు లు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ సీఎం కార్యాలయంతోపాటు, పలువురు కీలక అధికారులకు ఛాంబర్లు నిర్మిస్తారు. కాన్ఫరెన్స్, డైనింగ్ హాళ్లు, వీఐపీ లాంజ్‌ను నిర్మించనున్నట్లు సమాచారం. కాగా, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి కార్యకలపాలు చక్కబెడుతున్నారు. తొలుత గచ్చిబౌలి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో కొత్త క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు స్థలాలు పరిశీలించినా.. చివరకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థవైపు అధికారులు మ్నొగ్గు చూపారు.

## నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య



**తెలంగాణ వీణ/ఆదిలాబాద్:** నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే దారుణంగా ఓ యువకుడిని హత్య చేశారు. వివరాల్లోకి వెళ్తే .. ఆదిలాబాద్ జిల్లా, ఇచ్చోడ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ఓ యువకుడిని ఇద్దరు వ్యక్తులు గొడ్డలి, కత్తులతో వెంబండించారు. జనమంతా చూస్తుండగానే సిరిచెల్మ చౌరస్తాలో ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో దారుణంగా హతమార్చారు. హత్యకు గురైన యువకుడిని వాములే ఈశ్వర్‌గా స్థానికులు గుర్తించారు. మండలంలోని గాంధీవాగు గ్రామానికి చెందిన ఈశ్వర్ ఇచ్చోడ టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మృతుని బాబాయ్ పాండురంగ్, అతని కుమారుడు సూర్యకాంత్ ఈ హత్య చేసి పరారీ అయ్యారని పోలీసులు తెలిపారు. భూ తగాదాలతోనే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోందని అన్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు..



**తెలంగాణ వీణ/ములుగు:** ఆర్‌టిసి బస్సు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త కారణంగా గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఘటన సిద్దిపేట జిల్లా, మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..మంగళవారం సిద్దిపేట డిపోకి చెందిన ఆర్‌టిసి బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తోంది. మార్గమధ్యంలో ములుగు హవెల్లి ఫాం వద్దకి రాగానే అతివేగంతో ఉన్న బస్సు ముందుగా వెళ్తున్న హెచ్‌పి గ్యాస్ ట్యాం కర్‌ను వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం, ట్యాంకర్ వెనుక భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఎమ్మెల్యే మాధవ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పట్టణ ప్రచార కార్యదర్శి కొల్లూరి మధు



**తెలంగాణ వీణ/నర్సంపేట:** నూతనంగా నర్సంపేట శాసనసభ్యులుగా ఎన్నికైన దొంతి మాధవ రెడ్డిని హనుమకొండలోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలే బోకే అందించిన నర్సంపేట కాంగ్రెస్ పట్టణ ప్రచార కార్యదర్శి కొల్లూరి మధు

# కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో వేడెక్కిన రాజకీయం..

**- ఇప్పటి నుంచే ప్రచారం షురూ చేసిన బీఆర్ఎస్**


**ఉద్యమ ప్రస్థానం నుండి సెంటిమెంట్‌గా కలిసి వచ్చిన కరీంనగర్ లోక్‌సభ స్థానంపై గులాబీ పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. కరీంనగర్‌లో పార్టీ వీక్ కావడం కూడా రాష్ట్రంలో ఓటమికి బలమైన కారణమన్న ఆలోచనలో ఆ పార్టీ ముఖ్యులు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుండే పావులు కదపాలని భావిస్తోంది బీఆర్ఎస్ పార్టీ.**



**తెలంగాణ వీణ/కరీంనగర్:** ఉద్యమ ప్రస్థానం నుండి సెంటిమెంట్‌గా కలిసి వచ్చిన కరీంనగర్ లోక్‌సభ స్థానంపై గులాబీ పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. కరీంనగర్‌లో పార్టీ వీక్ కావడం కూడా రాష్ట్రంలో ఓటమికి బలమైన కారణమన్న ఆలోచనలో ఆ పార్టీ ముఖ్యులు ఉన్నట్టుగా తెలుస్తోంది. ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుండే పావులు కదపాలని భావిస్తోంది బీఆర్ఎస్ పార్టీ. కరీంనగర్‌తో పాటు ఉత్తర తెలంగాణాపై స్పెషల్ ఫోకస్ చేసినట్టుగా స్పష్టం అవుతోంది.కరీంనగర్ లోకసభ స్థానం నుండి గెలువాలన్న లక్ష్యంతో మాజీ ఎంపీ వినోద్ కుమార్ పావులు కదపడం ఆరంభించారు. పార్టీ శ్రేణులతో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు సీక్రెట్ ఆపరేషన్లు కూడా చేపట్టారు. కరీంనగర్ లోకసభ పరిధిలోని సిరిసిల్ల, కరీంనగర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలువగా, మిగిలిన నాలుగు సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇప్పటి నుండి ఆ సమస్యను అధిగమించేందుకు అవసరమైన వ్యూహాలకు పదునుపె డుతున్నారు వినోద్ కుమార్.అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యాలను సవరించుకుంటూ ఆయా నియోజకవర్గాల ఇంఛార్జీలతో కూడా సమీకరణాలు నెరిపే పనిలో పడ్డారు. రెండు మూడు నెలల్లో లోకసభ ఎన్నికలు జరగనున్నందున పట్టు నిలుపుకోవాలన్న సంకల్పంతో వినోద్ కుమార్ పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపే పనిలో పడ్డారు. అటు ప్రధాని నరేంద్ర మోదీ మానియా ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన ప్రభావం ఎంపీ ఎన్నికలపై తీవ్రంగా ఉండే అవకాశాలు లేకపోలేదని గమనించిన ఆయన ఇప్పటి నుండే కార్యరంగంలోకి దిగి తనకు అనుకూలమైన వాతావరణం క్రియేట్ చేసుకుంటున్నారు.అయితే ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో విజయం సాధించడం ఖాయం అనుకున్నప్పటికీ, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను నిరుత్సాహ పరిచింది. ఈ నైరాశ్యం ముఖ్య నాయకుల నుండి మొదలు సామాన్య కార్యకర్తలోనూ కనిపిస్తుండడంతో వారిలో మానసిక ధృడత్వాన్ని నింపాలన్న యోచనతో వినోద్ కుమార్ సాగుతున్నారు. ఓటమి వల్ల పార్టీ శ్రేణుల్లో నెలకొన్న దిగులును దూరం చేయడం కోసం ప్రత్యేక దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో చప్పబడిపోతే, దీని ప్రభావం లోకసభతో పాటు స్థానిక సంస్థల్లోనూ పడే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఎంపీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ కేడర్‌ను తీర్చిదిద్దే పనిలో నిమగ్నం అయ్యారు.

# కోరలు చాస్తున్న కరోనా

**- తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన కలిగిస్తున్న కొవిడ్ మరణాలు - తెలంగాణలో రెండు, ఎపిలో ఒక కొవిడ్ మరణం నమోదు - రాష్ట్రంలో కొత్తగా 8 కొవిడ్ కేసులు... అన్నీ హైదరాబాద్‌లోనే...**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలంగాణలో రెండు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక కొవి డ్ మరణం నమోదు కావడం పట్ల తెలుగు ప్రజ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో దాదాపు ఏడాదిన్నర తర్వాత రెండు కరోనా మ రణాలు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో ఒక కరోనా మరణం నమోదైంది. ఉస్మానియా ఆస్పత్రిలో ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో చనిపోయి న ఇద్దరిలో కొవిడ్ గుర్తించినట్టు ఆస్పత్రి వర్గా లు సైతం ధ్రువీకరించాయి. ఉస్మానియా ఆస్పత్రిలో ఊపిరితిత్తుల వ్యాధితో చేరిన ఓ రోగి మృ తి చెందగా, మరొకరు గుండె సంబంధిత వ్యాధి తో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు ఆ ఇద్దరికి చేసిన వైద్య పరీక్షల్లో కరోనా నిర్ధరణ అయినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.అలాగే ఎపిలోని విశాఖపట్నంలో కెజిహెచ్ ఆసుపత్రిలో కరోనాతో ఆసుపత్రిలో చేరిన ఒక మహిళ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

### వేగంగా వ్యాప్తిస్తున్న కొవిడ్ వైరస్

రాష్ట్రంలో కొవిడ్ వైరస్ మరోమారు వేగంగా వ్యాపిస్తోంది. గడచిన వారం రోజుల్లోనే ఏకం గా 59 మందికి వైరస్ సోకినట్టు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి. అందులోనూ హైదరాబాద్‌లోనే దాదాపు 90 శాతానికి పైగా కేసులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రా ష్ట్రంలో గడిచిన 24 గంటల్లో 1,333 కరోనా పరీక్షలు చేయగా 8 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంగళవారం కరోనా బులిటెన్ విడుదల చేసింది. కొత్తగా నమోదైన కేసుల్లో హైదరాబాద్‌లోనే 8 కేసులు నమోదయ్యాయి. ఒక్కరోజు వ్యవధిలో ఈ మహమ్మారి నుంచి నలుగురు కోలుకోగా.. మరో 59 మంది ఐసోలేషన్‌లో ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. మరో 30 మంది రిపోర్టులు రావాల్సి ఉందని ఆరోగ్య శాఖ పేర్కొంది. రాష్ట్రంలో కొవిడ్ నమోదవుతున్నందున ప్రభుత్వం అప్రమత్తమైంది. కొవిడ్ పరీక్షలు పెంచి పాజిటివ్ వచ్చిన వారికి చికిత్సలు అందించేందుకు ఆసుపత్రులను సిద్ధం చేసింది. పిల్లలు, వృద్ధులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఉన్నవారు సమూహంగా ఉన్న జనంలోకి వెళ్లకపోవడం, మాస్క్ ధరించడం మంచిదని తెలిపారు. రోగనిరోధక శక్తి పెంచేందుకు సంతులిత ఆహారం తీసుకోవాలనన్నారు. ప్రభుత్వం తెలిపిన కొవిడ్ నియమాలను తప్పక పాటించాలని సూచించారు.

### అవి కొవిడ్ మరణాలు కావు :

**గోషామహల్:** అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఇద్దరు రోగులు మృతి చెందారు. ఇన్ పేషంట్లుగా చికిత్సలు పొందుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. కాగా చికిత్సల నేపథ్యంతో వారికి నిర్వహించిన కొవిడ్ పరీక్షల నివేదిక మరుసటి రోజు రావడంతో వారికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అయితే ఉస్మానియా ఆసుపత్రిలో కరోనాతో చికిత్సలు పొందుతూ ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ వివరణ ఇచ్చారు. కొవిడ్ లక్షణాలతో వారు చికిత్సలకు రాలేదని, వారు అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందిన తర్వాత వారికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే%ా%. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న బండ్లగూడ దూద్‌బౌలీ ప్రాంతానికి చెందిన మహ్మద్ సుభాన్ (62) చికిత్సల నిమిత్తం ఈ నెల 14వ తేదీన ఉస్మానియా ఆసుపత్రిలో చేరాడు. ఎడమ జఠరిక (గుండె సంబంధిత వ్యాధి) శ్వాసకోస వంటి అనారోగ్య ఇబ్బందులతో చికిత్సలు పొం దుతున్నారు. కాగా అతనికి కొవిడ్ లక్షణాలున్న ట్లు అనుమానించిన వైద్యులు ఈనెల 22న కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. గుండె, ఊపిరితిత్తులు ఫెయిల్ కావడంతో సుభాన్ ఆరోగ్య పరిస్థితి విషమించి, ఈ నెల 24వ తేదీన మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అతను మృతి చెందిన మరుసటి రోజున కొవిడ్ పరీక్ష నివేదికలో మహ్మద్ సుభాన్‌కు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. కాగా అదే విధంగా కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ (42) శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్సల నిమిత్తం ఈ నెల 19వ తేదీన ఉస్మానియా ఆసుపత్రిలో చేరాడు. యూసుఫ్‌ను ఇన్ పేషంట్‌గా చేర్చుకుని మె డిసిన్ విభాగం వైద్యులు చికిత్సలు నిర్వహిస్తున్నారు. చికిత్సల్లో భాగంగా ఈ నెల 20న యూసుఫ్‌కు కొవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న మహ్మద్ యూసుఫ్ ఆరోగ్య పరిస్థితి వికటించడంతో 22న మృతి చెందాడు. మృతి చెందిన అనంతరం కొవిడ్ పరీక్ష నివేదికలో మహ్మద్ యూసుఫ్‌కు కొవిడ్ సోకినట్లు తేలిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వీరిద్దరిలో ఎవ్వరూ కూడా కొవిడ్ లక్షణాలతో చికిత్సల నిమిత్తం రాలేదని, ఇతరత్రా అనారోగ్య కారణాలతో వచ్చినప్పటికీ చికిత్సల్లో భాగంగా కోవిడ్ పరీక్షలు చేసినట్లు డ్యూటీ ఆర్ఎంవో డాక్టర్ మహ్మద్ రఫీ తెలిపారు.

### మరో ముగ్గురికి కొవిడ్ చికిత్సలు...

ఉస్మానియా ఆసుపత్రిలో కొవిడ్ పాజిటివ్ రావడంతో మరో ముగ్గురికి ఐసోలేషన్ వార్డులో ఉస్మానియా వైద్యులు చికిత్సలు నిర్వహిస్తున్నారు. కొవిడ్ ఇతర లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన 12 ఏళ్ల బాలికతో పాటు రాజేంద్రనగర్‌కు చెందిన పల్లె లక్ష్మణ్ (36), వికారాబాద్ జిల్లా ధారూర్ ప్రాంతానికి చెందిన పార్వతమ్మ (62)లు ఈ నెల 20న చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేరగా, వారికి కొవిడ్ పాజిటివ్‌గా తేలడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో వారికి చికిత్సలు అందిస్తున్నారు.

### నెల రోజులుగా పరీక్షలు నిర్వహిస్తున్నాం : ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేరిన ఇన్ పేషంట్లకు కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉస్మాని యా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ తెలిపారు. ఇతర రోగులకు ఇబ్బందుతు తలెత్తవద్దన్న ఉద్దేశంతో గల నవంబర్ నెల నుండి ఇన్ పేషంట్లకు కొవిడ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కొవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో చికిత్సలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల వాతావరణ మార్పులతో చలి తీవ్రత పెరగడంతో ఉస్మానియాలో చికిత్స లు పొందుతున్న ప్రతి రోగికి కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరో ముగ్గురికి కొవిడ్ పాజిటివ్ రావడంతో వారికి ఐసోలేషన్ వా ర్డులో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. కాగా రోగులకు చికిత్సలు ని ర్వహిస్తున్న క్రమంలో ఆసుపత్రికి చెందిన ఇద్దరు వైద్యులకు కొవిడ్ సోకడంతో వారు ఐసోలేషన్లో ఉండి, చికిత్సలు పొందుతున్నట్లు తెలిపారు.

## తాడ్వాయిలో జింకల వేట: ఒకరి అరెస్ట్

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** ములుగు జిల్లా తాడ్వాయి డివిజన్‌లోని బొల్లేపల్లి సౌత్ బీట్‌లో చుక్కల జింకను వేటాడిన ఉదంతం అటవీశాఖ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో తక్షణమే అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ట్రాప్ చేయగా ఒక వ్యక్తి పట్టుబడ్డారు. అతను ఉపయోగించిన వైర్‌ని , మచ్చల జింక చర్మంలో కొంత భాగాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయంపై దర్యాప్తు చేస్తుండగా ఈ నేరానికి పాల్పడిన 6 మంది వ్యక్తులను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరుస్తున్నారు. నిందితులో ఒకరి ఇంట్లో నుండి ఎండబెట్టిన జింక మాంసాన్ని కూడా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారులు ఇటీవల క్యాచ్ ది ట్రాప్ అనే పేరుతో రాష్ట్రవ్యాప్త డ్రైవ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీని కింద వేటకు ఉపయోగించే వలలు, ఉచ్చులు మొదలైన అన్ని రకాల పరికరాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలియజేశారు.

# ప్రజా పాలన షురూ

**- పథకాల దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం**

**- దరఖాస్తు నింపుటకు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు**

**- దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు జత చేయాలి**

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల**




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న గ్రామ వార్డు సభలను కట్టుదిట్టంగా నిర్వహించుటకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు.మంగళవారం ఖమ్మం ఐడిఓసి కార్యాలయంలో డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ వార్డు సభల నిర్వహణపై పంచాయతీ రాజ్ నియోజకవర్గ మండల ప్రత్యేక అధికారులు మున్సిపల్ కమిషనర్లు తహసిల్దార్లు ఎంపిడివోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు.ప్రతి గ్రామ పంచాయతీ మున్సిపాల్టీలలో టీములు ఏర్పాటు చేయాలన్నారు.ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. 27వ తేదీ వరకు అన్ని గృహాలకు ప్రజాపాలన దరఖాస్తులు అందచేయాలని చెప్పారు. లబ్ధిదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దరఖాస్తు నింపుటకు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కౌంటర్లలో మహిళలకు వయోవృద్ధులకు దివ్యాంగులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.ప్రజలకు పరిపాలన చేరువ చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు రాకుండా సజావుగా నిర్వహించాలని చెప్పారు.డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు 31, జనవరి 1 ప్రభుత్వ సెలవులు మినహాయించి అన్ని కార్యాలయ పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం పరిధిలో తహసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షిప్టు లల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రజాపాలన సభలలో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. మహాలక్ష్మి రైతు భరోసా చేయూత గృహ జ్యోతి ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రతి గ్రామానికి దరఖాస్తులు ఒకరోజు ముందుగానే అందచేయాలని గ్రామ ప్రజలకు ముందుగానే దరఖాస్తులు అందించాలని దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామంలోని నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడీ టీచర్లు స్వయం సహాయక మెప్మా సంఘాల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు.గ్రామసభల నిర్వహణకు సంబంధించి ముందస్తు తయారు చేసిన షెడ్యూలు ప్రకారం సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని చెప్పారు. ప్రజాపాలన నిర్వహణపై మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో మున్సిపల్ వార్డులో ప్రజా పాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు ముందస్తుగా తెలియజేసేందుకు టామ్ టామ్ లు వేయించాలని చెప్పారు. ప్రజాపాలన సభ నిర్వహణకు అవసరమైన మౌళిక సదుపాయాలు త్రాగునీరు కుర్చీలు అవసరమైన బల్లలు షామియానాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు జత చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం 27వ తేదీన ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు విడుదల చేస్తుందని వెంటనే మండలాలకు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ప్రతిరోజు ప్రజాపాలన సభలలో తీసుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని దరఖాస్తుదారునికి రసీదు అందించాలని ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వారిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ మున్సిపల్ వార్డులో ప్రజాపాలన సభల నిర్వహణకు ఇంచార్జిలను ఏర్పాటు చేయాలని గ్రామ సభలలో ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలి కౌంటర్లలో ఎవరు విధులు నిర్వహించాలని మొదలు కొని ప్రతి అంశం ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని చెప్పారు. సిబ్బందికి ముందస్తుగానే విధులు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## దరఖాస్తులు ఇచ్చే కౌంటర్ల వద్ద బందోబస్తు...

ఎస్పి డాక్టర్ వినీత్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో డిఎస్పి, మున్సిపల్ స్థాయిలో సీఐ, గ్రామస్థాయిలో ఎస్ ఐ బందోబస్తు విధులను పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. దరఖాస్తులు ఇచ్చుటలో కౌంటర్లు వద్ద రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టాలని చెప్పారు.రద్దీ ఉంటే ముందస్తుగా టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. క్రమ పద్ధతి పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలి.స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ మహాలక్ష్మి రైతు భరోసా చేయూత గృహ జ్యోతి ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని దరఖాస్తుదారులు ముందస్తుగా దరఖాస్తు ఫారం నింపుకొని గ్రామ సభకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామసభ నిర్వహణపై దప్పు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజాపాలన గ్రామసభ నిర్వహించే ప్రదేశం సమయం వివరాలు ముందస్తుగా ప్రచారం చేయాలని చెప్పారు.గ్రామసభ నిర్వహణ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్, ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, జడ్పి సీఈవో విద్యాలత, డిపిఓ రమాకాంత్, అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సింగరేణిలో ఎన్నికలు






**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** సింగరేణి గుర్తింపు ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఇందుకు గాను సింగరేణి యాజమాన్యం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.మొత్తం అన్ని ఏరియాల్లో 39,773 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సింగరేణిలో మొట్టమెదటి సారిగా 1998లో, చివరిగా 2017న గుర్తింపు ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు ఏడో దఫా జరుగుతున్న గుర్తింపు ఎన్నికల ప్రక్రియలో మొత్తం 13 యూనియన్లు ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి.ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్ర కార్మిక శాఖ గుర్తించిన విధంగా కంపెనీలోని 11 ఏరియాలలో 84 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికల పద్ధతిలోనే నిర్వహించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో 27న ఉదయం 7 గంటల నుండి ఐదు గంటల వరకు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ప్రతి ఓటరు ఉద్యోగి విధిగా తమ గుర్తింపు కార్డును (ఐడేంటిటీ శాశ్వత తాత్కాలిక) వెంట తీసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

# ఆధార్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలి

**- బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ యెర్రా కామేష్**



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయని వాటిని పరిష్కరించుకోవాలంటే ఆధార్ సెంటర్లు తక్కువగా ఉన్నాయని అన్నారు. ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేయాలన్నా సరే ఆధార్ కార్డులో పుట్టిన తేదీ సంవత్సరం తదిత వివరాలు పొందుపరచాలన్న చాలా సమయం పడుతుందని మీ సేవ కేంద్రాలో రోజుకు నలభై మందికి మిగత కేంద్రల్లో కేవలం ముప్పై మందికి మాత్రమే టోకెన్లు జారీ చేయడంతో జిల్లా కేంద్రంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి ప్రజలు చలిలో వచ్చి ఆధార్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుండే క్యూలైన్ లో పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కావడంతో చాలా సమస్యలపై ప్రజలు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఆధార్ సంబంధిత సమస్యలపై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామవరం, రుద్రంపుర్, సుజాతనగర్, చుంచుపల్లి, నవభారత్, పాల్వంచ, పెద్దమ్మతల్లి దేవాలయం తదితర ప్రాంతల్లో కొత్తగా ఆధార్ కేంద్రాలను మంజూరు చేయాలని అదేవిధంగా ఉన్న ఆధార్ కేంద్రాల్లో కౌంటర్లు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పుల కొరకు ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నా నియోజకవర్గంలో పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, చేనిగారాపు నిరంజన్ కుమార్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం: ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** కార్మిక పక్షపాతి పేదల పక్షపాతి దళిత జన బాంధవుడు స్వర్గీయ గడ్డం వెంకట స్వామి( కాకా) అందించిన సేవలు చిరస్మరణీయమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. గడ్డం వెంకటస్వామి కుమారులైన ప్రస్తుత శాసనసభ్యులు గడ్డం వినోద్ గడ్డం వివేక్ ల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్వర్గీయ గడ్డం వెంకటస్వామి వర్ధంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గడ్డం వెంకటస్వామి కాకా వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మద్దెలతోపాటు పలువురు మాట్లాడుతూ వెంకటస్వామి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఆత్మీయ వర్ధంతి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, మాజీ జడ్పిటిసి సభ్యులు రాష్ట్ర మాల మహానాడు నాయకులు గిడ్ల పరంజ్యోతిరావు, జాతీయ సంగీత విద్వాన్ కలవల రాందాస్, చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంతోటి పాల్, ఏజెన్సీ హక్కుల సాధన కమిటీ అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, ప్రముఖ గాయకులు సింగర్ ఆఫ్ సింగరేణి అల్లి శంకర్, సినీ నటులు చిత్రపురి సొసైటీ సభ్యులు తాండూర్ ధనరాజ్, సంఘ జిల్లా ఆర్గనైజర్ స్టీవెన్ లాజరస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు చేస్తాం



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** ప్రజాపాలన ద్వారా నిర్వహిస్తున్న గ్రామసభలలో అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.పరకాల పట్టణంలోని మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమీక్షా సమావేశం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, నిర్వహించారు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలపై గ్రామ బూత్ ల వారిగా సమీక్షించారు.ప్రజా పాలన కార్యక్రమం విజయవంతంగా చేయుటకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో.కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కష్టపడి పట్టుదలతో పనిచేయడం వల్లే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని తన గెలుపు కార్యకర్తలకు అంకితం అని అన్నారు. ప్రజాపాలన ద్వారా ఈనెల 28 నుండి జనవరి 6 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలలో అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించి వారి కుటుంబానికి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అందించేలా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎదురుచూపులే మిగిలాయని అర్హులైన నిరుపేదలు ఉన్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని ప్రభుత్వ పథకాల ఎంపికలో వివక్ష చూపారని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలుపించుకోగానే సరిపోదని రాబోయే సర్పంచ్ ఎంపీటీసీ ల ఎన్నికలలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీని గెలుపించుకొన్నపుడే ఫలితం దక్కుతుందని అన్నారు కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు.

# ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రజా ప్రతినిధులు



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** హనుమకొండ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలనకార్యక్రమాన్ని నిర్వహిస్తుందని హనుమకొండ జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని మీటింగ్ హాలులో జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పాలనను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా నిర్ణీత కాలవ్యవధిలో సంక్షేమ పథకాలు 6 గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని ఈనెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ అదేవిధంగా పట్టణ ప్రాంతంలోని ప్రతి మున్సిపల్ వార్డులోనూ సమర్థవంతంగా నిర్వహించే విధంగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు వివిధ శాఖల అధికారులతో కూడిన ప్రతి బృందం రోజుకు ఉదయం 8 గంటలనుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం6 గంటల వరకు రెండు షిఫ్టులో సభలు నిర్వహించాలన్నారు సభలలో ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు జనవరి 6వ తేదీ నాటికి అన్ని గ్రామాలలో కార్యక్రమాన్ని పూర్తిచేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు రెవెన్యూ, పంచాయతీరాజ్ మున్సిపల్ పౌరసరఫరాలు వైద్య ఆరోగ్య శాఖ విద్యా విద్యుత్తు వ్యవసాయ తదితర శాఖలతో బృందాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామసభల వద్ద మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు గ్రామ సభలకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా మహేందర్ జి డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్ డిపిఓ జగదీశ్వర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశీబుగ్గ,పోచమ్మ మైదాన్ ఎల్బీనగర్ ప్రాంతంలోని అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తామని అన్నారు తూర్పు నియోజకవర్గం లో వివిధ డివిజన్ నాయకుల సమావేశంలో లబ్దిదారులకు చెక్కలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ అధ్వర్యంలో 21వ డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్ కుమార్ డివిజన్ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగినది 21వ డివిజన్ లో 11 చెక్కలు లబ్దిదారులకు పంపిణీ చేశారు సందీప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్మణ్ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ 6 గ్యారంటీలో 100 రోజులు అమలు చేస్తామని దేశానికే మార్గదర్శకంగా పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ బ్లాక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు కాంగ్రెస్ నాయకులు బొట్ల సదానందం మారేడు నర్సయ్య ఎండి అఫ్జల్ కొమ్ముల ప్రదీప్ ఎండి బాబా ఎస్డి బాబా ఏం డి ఖలీల్ రెడ్డి మల్ల స్వామి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఇటుక బట్టీ గోడ కూలి ఆరుగురి మృతి



**తెలంగాణ వీణ/రూర్కీ :** ఉత్తరాఖండ్ లోని లహబోలి గ్రామంలో మంగళవారం ఇటుకబట్టీ గోడ కూలి ఆరుగురు కార్మికులు మృతి చెందారు. అయితే ఇంకా గోడ శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బట్టీలో ఇటుకలు నింపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానిక యంత్రాంగం, పోలీస్‌లు రంగం లోకి దిగి జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించే పని చేపట్టారు. వైద్య సహాయక బృందం కూడా ప్రమాదస్థలానికి చేరుకుంది.

## భారత్ చేరుకున్న దాడికి గురైన నౌక



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** అరేబియా సముద్రంలో దాడికి గురైన ఇండియన్ షిప్ భారత్ చేరుకుంది. దాడికి గురైన వ్యాపార నౌక ఎంవి ఫ్లూటోలో విచారణ చేపట్టారు. భారత నౌకాదళానికి చెందిన పేలుడు పదార్థాలపై విస్తృత విచారణ చేపట్టిన అధికారులు.. తాజాగా మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్, సాంకేతిక విశ్లేషణ చేపట్టామని నౌకాదళాధికారులు వివరించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్ ఐసిజిఎస్ విక్రమ్ రక్షణలో, ఎంవి కెమ్ ప్లూటో సోమవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత ముంబై నౌకాశ్రయానికి చేరుకుంది.ఓడపై దాడి ఎలా జరిగిందనే దానిపై భారత కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, సంబంధిత అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు. నౌకపై దాడి చేసేందుకు ఉపయోగించిన క్షిపణినా లేక డ్రోనా అనే విషయాన్ని గుర్తించేందుకు ఏజెన్సీలు ప్రయత్నిస్తాయి. నౌకలో లభ్యమైన పేలుడు పదార్థాలు, శకలాలను బట్టి ఇది ఖచ్చితంగా డ్రోన్ దాడేనని భావిస్తున్నారు.

## అయోధ్య రామాలయ నిర్మాణంపై కీలక అప్‌డేట్



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** అయోధ్యలో రామాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అద్భుతకమైన కళాకృతులతో ఆలయ నిర్మాణం సాగుతోంది. జనవరి 22వ తేదీన ఆ ఆలయంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట జరగనున్నది. అయితే ఈ ఆలయ నిర్మాణం కోసం 392 పిల్లర్లు వాడినట్లు రామజన్మభూమి ట్రస్టు జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ తెలిపారు. 14 ఫీట్ల వెడల్పుతో పెర్‌కోటాను తీర్చిదిద్దారు. సుమారు 732 మీటర్ల ఉంటుంది. రామాలయం కాంప్లెక్స్‌లో దాదాపు 70 శాతం ఏరియా గ్రీన్‌గా ఉంటుందన్నారు.ఆత్మనిర్భర్ కాన్సెప్ట్‌తో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. సీవేజ్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఉంటాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండే రీతిలో ఆలయ ప్రవేశం ఉంటుందన్నారు. రామాలయం కాంప్లెక్స్‌కు చెందిన ల్యాండ్‌స్కేప్ ప్లాన్‌ను ఆయన ట్రస్టు సభ్యులతో ఇవాళ షేర్ చేశారు. 70 ఎకరాలు ఉన్న ఆలయంలోని 70 శాతం ప్రాంతం పచ్చికతో నిండి ఉంటుందన్నారు.ఫైర్ బ్రిగేడ్ పోస్టు కూడా ఆలయంలో ఉంటుందన్నారు. అగ్నిమాపక సిబ్బంది అండర్ గ్రౌండ్ రిజర్వాయర్ ద్వారా తమకు కావాల్సిన నీరును తీసుకుంటుందని చంపత్ రాయ్ తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల గురించి టెంపుల్ కాంప్లెక్స్‌లో లిఫ్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎంట్రెన్స్ వద్ద రెండు ర్యాంప్‌లను కూడా సిద్ధం చేస్తున్నారు. అయోధ్యలోని కుబేర్ తిల ప్రాంతంలో జఠాయువు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చంపత్ రాయ్ చెప్పారు.

# కర్ణాటకలో కరోనాతో ముగ్గురి మృతి

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** దేశంలో కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోంది. కొత్తగా 412 కేసులు నమోదు కావడంతో క్రియాశీల కేసుల సంఖ్య 4170 కి చేరింది. కొత్త వేరియంట్ జెఎన్.1 కారణంగానే కేసులు అధికంగా నమోదవుతున్నాయి. కేరళలో అత్యధికంగా కేసులు వెలుగు చూస్తున్నాయి. ఇదిలా ఉండగా కర్ణాటకలో కొత్త వేరియంట్ కేసులు బయటపడ్డాయి. గత 24 గంటల్లో కర్ణాటకలో మంగళవారం ముగ్గురు మరణించడంతో మరణాల సంఖ్య 5,33, 337కు చేరింది. బెంగళూరులో ఇద్దరు, రామనగర జిల్లాలో ఒకరు వైరస్ బారిన పడి చనిపోయారు.కరోనా కొత్త సబ్‌వేరియంట్ జేఎన్.1 (జెఎన్.1) కేసులు మరో ఆరు కొత్తగా నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 69 కి చేరిందని మంగళవారం అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ వేరియంట్ బాధితులు చాలామంది ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నారని. ఆస్పత్రిలో చేరిన వారి సంఖ్య పెరగలేదని వివరించాయి. దేశంలో తాజాగా కరోనా కేసులు 412వరకు బయటపడగా, క్రియాశీల కేసులు 4170కు పెరిగాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మంగగళవారం వెల్లడించింది.ప్రస్తుతం దేశం మొత్తం మీద కరోనా కేసుల సంఖ్య 4,50,09,660 కు చేరగా, కోలుకున్న వారి సంఖ్య 4,44,72, 153 వరకు ఉంది. రికవరీ రేటు 98.81 శాతం ఉంది. మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. ఇంతవరకు 220. 67 కోట్ల వ్యాక్సిన్ డోసులు పంపిణీ అయ్యాయి. గత కొత్త వేరియంట్‌పై గతవారం చాలా లోతుగా అధ్యయనం చేయడమైందని, ఈమేరకు పరీక్షలు ముమ్మరం చేయాలని, పరిశీలన ప్రక్రియలు మరింత బలోపేతం చేయాలని నీతి అయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ వికె పాల్ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించారు. ఈ వేరియంట్ కేసులు పెరుగుతున్నప్పటికీ, తక్షణం ఆందోళన చెందనక్కర లేదని, 92 శాతం మంది బాధితులు ఇంటివద్దనే చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రానున్న పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొవిడ్ 19 నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సమాయత్తం కావాలని , ఈ వ్యాధి వ్యాప్తి కాకుండా ప్రజారోగ్య ప్రమాణాలు పాటించాలని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి సుధాంశు పంత్ గత వారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖల ద్వారా సూచించారు.సవరించిన మార్గదర్శకాల ప్రకారం





సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల వారీగా ఇన్‌ఫ్లుయెంజా వంటి కేసులు, తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు అన్ని ఆరోగ్యకేంద్రాల్లో పర్యవేక్షించాలని, కేసులు వేగంగా పెరుగుతుండడాన్ని మొదట్లోనే గుర్తించి ఆ సమాచారం తెలియజేయాలని రాష్ట్రాలకు సూచించారు.

## హిందూయిజంపై ఎస్‌పి నేత మౌర్య వివాదాస్పద వ్యాఖ్యలు



**తెలంగాణ వీణ/లక్నో:** హిందూయిజంపై సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు స్వామి ప్రసాద్ మౌర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ మతం ఒక మోసం అని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోడీ కూడా హిందూయిజం ఒక మతం కాదని, కేవలం జీవన విధానమని అన్నారు. వారు ఇలాంటి ప్రకటనలు చేస్తే మనోభావాలు దెబ్బతినవు. కానీ నేను చెబితేనే ఆ వ్యాఖ్యలు అశాంతిని కలిగిస్తాయి అని ఆయన అన్నారు. మౌర్య తన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు సుప్రీంకోర్టు తీర్పును కూడా ఉదహరించారు. 1955లో సుప్రీం కోర్టు తన తీర్పులో హిందూ మతం కాదు.ఒక జీవన విధానం అని చెప్పింది అని మౌర్య గుర్తుచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల ముందు యూపీలో బీజేపీని వీడి మౌర్య సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. మౌర్య హిందూ మతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. హిందూ మతాన్ని విమర్శిస్తూ గత ఆగస్టులో ఓ వీడియోను షేర్ చేశారు. హిందూత్వం కేవలం ఒక బూటకం. బ్రాహ్మణిజం మూలాలు చాలా లోతైనవి. అన్ని అసమానతలకు కారణం కూడా బ్రాహ్మణిజమే. హిందూ మతం అనే మతం లేదు. హిందూ మతం కేవలం బూటకం అని ఆ వీడియోలో పేర్కొన్నారు. రామచరిత్‌మానస్‌లోని కొన్ని శ్లోకాలు సామాజిక వివక్షను ప్రోత్సహిస్తున్నాయని మౌర్య గతంలో అన్నారు.

## ఇంటి గోడపై పులి.. గంటల కొద్దీ నిద్ర



**తెలంగాణ వీణ/లక్నో :** పులిని చూస్తేనే గజగజ వణికిపోతాం. అదే పులి జనవాసాల్లోకి వస్తే గుండెలు గుభిల్లు మన్నాలిందే. కానీ రాయల్ బెంగాల్ టైగర్ మాత్రం ఏకంగా ఓ గ్రామంలోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిబిత్ టైగర్ రిజర్వ్ ఫారెస్టుకు సమీపంలో అత్‌కోనా అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలోకి సోమవారం రాత్రి ఓ పులి వచ్చింది. అర్ధరాత్రి దాటాక గ్రామంలోకి ప్రవేశించిన పులి షిందు సింగ్ అనే రైతు ఇంటి గోడపై దాదాపు ఆరు గంటల పాటు హాయిగా నిద్రించింది. ఇది చూసిన కుక్కలు గట్టిగా అరవడం మొదలుపెట్టాయి. వెంటనే నిద్ర నుంచి లేచిన షిందు సింగ్.. గోడపై నిద్రిస్తున్న పులిని చూసి షాక్ అయ్యాడు. వెంటనే తన ఇంటి సమీపంలో ఉండే వారికి విషయం చెప్పాడు. ఇక ఈ విషయం ఊరంతా తెలిసింది. పులి నుంచి రక్షణ కోసం కొందరు తమ ఇంటి బయట మంటలు వెలిగించారు. మరికొందరు బిల్డింగ్ పైకి ఎక్కారు.మరికొందరు షిందు సింగ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. నిద్రిస్తున్న పులిని చూశారు. కొందరు తమ సెల్ ఫోన్లలో ఆ దృశ్యాలను బంధించారు. మరికొందరు పులికి దూరంగా ఉండి సెల్ఫీలు తీసుకున్నారు. ఇంతలో జనం అలికిడి విని పులి నిద్ర లేచింది. అందరూ చూస్తున్నా ఆ పులి ఏ మాత్రం వారిని పట్టించుకోలేదు. వారిపై దాడి కూడా చేయలేదు. గ్రామస్తులే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న అధికారులు.. గోడ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పులికి మత్తు మందు ఇచ్చి బంధించారు. ఆ తర్వాత పులిని అక్కడి నుంచి తరలించారు. ఈ పులికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## వాళ్లు సముద్రంలో ఎక్కడ దాక్కున్నా వేటాడి కఠినంగా శిక్షిస్తాం: రాజ్‌నాథ్ సింగ్



**తెలంగాణ వీణ/ముంబై:** భారత్‌కు వచ్చే వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. వాణిజ్య నౌకలపై వరుస దాడుల నేపథ్యంలో సముద్ర జలాల్లో గస్తీని ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. నౌకలపై దాడులకు పాల్పడిన వారు సముద్రంలో ఎక్కడ దాక్కున్నా వేటాడి పట్టుకుంటామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్'ను ముంబై వేదికగా నౌకాదళంలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్ తీరానికి సమీపంలో అరేబియా సముద్రంలో ప్రయాణిస్తోన్న వాణిజ్య నౌక 'ఎంవీ కెమ్ ప్లూటో'పై డిసెంబర్ 23న డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న భారత నౌకాదళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది.'ఐసీజీఎస్ విక్రమ్' రక్షణలో ఆ వాణిజ్య నౌక ముంబై పోర్టు ప్రాంతానికి చేరుకుంది. కాగా, అమెరికాకు చెందిన వాణిజ్య నౌక 'ఎంవీ కెమ్ ప్లూటో'పై దాడి ఇరాన్ భూభాగంపై నుంచే జరిగిందని పెంటగాన్ ఆరోపించింది. అయితే అమెరికా ఆరోపణలను ఇరాన్ ఖండించింది. అంతకుముందు 'ఎంవీ సాయిబాబా'పై కూడా దాడి జరిగింది. ఈ పరిణామాల నడుమ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఢిల్లీలో పొగమంచు.. ఐదు విమానాల మళ్లింపు



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ :** ఢిల్లీలో పొగమంచు కారణంగా రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం కూడా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ఢిల్లీకి చేరుకోవలసిన ఐదు విమానాలను జైపూర్‌కు మళ్లించినట్టు విమానాశ్రయం అధికారులు వెల్లడించారు. ఈ సమాచారం ప్రయాణికులకు అందించారు. మంగళవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పొగమంచు ఆవరించడంతో విజిబిలిటీ 150 మీటర్లకు పరిమితమైందని వాతావరణ శాఖ తెలిపింది.ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో 500 లేదా అంతకంటే తక్కువ విజిబిలిటీ నమోదవ్వగా పాలంలో 100, సఫ్దర్‌గంజ్‌లో 200 మీటర్లు నమోదైంది. నిన్నటివరకు ఢిల్లీలో విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయిన విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా పంజాబ్, హర్యానా, తూర్పు ఉత్తర ప్రదేశ్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఒడిశా లోని అనేక ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కమ్ముకుంటోంది. చండీగఢ్, బీహార్, త్రిపురలో తక్కువ మోతాదులో మంచు ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది. ఢిల్లీలో మరో ఐదు రోజులు వాతావరణ పరిస్థితి ఎలా ఉంటుందో వాతావరణ శాఖ నివేదిక విడుదల చేసింది.

## నిర్మలా సీతారామన్ రాజీనామా కోరుతూ ఆర్బీఐకి బాంబు దాడి హెచ్చరిక





**తెలంగాణ వీణ/ముంబై :** ఆర్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌పై బాంబు దాడికి పాల్పడతామని హెచ్చరిస్తూ ఆర్బీఐకి సోమవారం బెదిరింపు మెయిల్ వచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ రాజీనామా చేయాలని బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తి డిమాండ్ చేశాడని ముంబై పోలీసులు వెల్లడించారు.మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముంబైలోని 11 ప్రదేశాల్లో 11 బాంబు దాడులు జరుగుతాయని బెదిరింపు మెయిల్ హెచ్చరించింది. మెయిల్‌లో ప్రస్తావించిన ప్రాంతాలకు తాము విచారించేందుకు వెళ్లామని, అయితే అక్కడ ఎలాంటి అనుమానిత పదార్థాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.బెదిరింపు మెయిల్ ఖిలాఫత్.ఇండియాఏజీమెయిల్.కాం అనే ఐడీ నుంచి వచ్చింది. ముంబైలోని ఎంఆర్ఏ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఉదంతంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## యూట్యూబ్‌లో ప్రధాని మోదీ రికార్డు..





**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ కొత్త ట్రెండ్ క్రియేట్ చేస్తున్నారు. ఆయన యూట్యూబ్ ఛానల్‌లో సబ్‌స్క్రైబర్ల సంఖ్య రెండు కోట్లు దాటింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాధినేతలు అత్యధిక సంఖ్యలో మోదీకి యూట్యూబ్ ఖాతాదా రులుగా ఉన్నారు. ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో ప్రధాని తన వీడియోలను పోస్టు చేస్తుం టారు. ఆ వీడియోలను సుమారు 450 కోట్ల మంది ఇప్పటికే వీక్షించారు. ప్రపంచ నేతల్లో ఎవరు కూడా ఆయన దరిదాపుల్లోలేరు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిర్ బొల్సనారో సబ్‌స్క్రైబర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. ఆయనకు 64 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇక వ్యూస్ విషయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీ రెండో స్థానంలో ఉన్నారు. ఆయన వీడియోలకు 22.4 లక్షల వ్యూవ్స్ ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు 7.89 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయిప్ ఎర్డగోన్‌కు 3.16 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.యోగా విత్ మోదీ అన్న యూట్యూబ్ ఛానల్‌లో కూడా మోదీకి ఫుల్ క్రేజీ ఉంది. ఆ ఛానల్‌లో ఆయనకు 73 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. రాహుల్ గాంధీ ఛానల్‌కు 35 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రధాని మోదీ తన యూట్యూబ్ ఛానల్‌ను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 2007లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో ఆయన పాపులారిటీ తగ్గలేదు.

# ఘనంగా సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం

**తెలంగాణ వీణ/కాప్రా:** దేశంలో విభజన రాజకీయాలను సమర్థిస్తూ, ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచి పోషిస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్. బోస్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ ముందు ఏర్పాటు చేసిన జెండాను సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి ఎగురవేశారు. అదేవిధంగా ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఎర్రజెండాను సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలను నిర్మించి విజయం సాధించి వాటి ప్రతిఫలాలను ప్రజలకు అందించడంలో సీపీఐ ఎనలేని కృషి చేసిందని అన్నారు.సీపీఐ పార్టీ నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర




ఉన్నదని వారు ఉద్ఘటించారు.కానీ దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం విభజన రాజకీయాల చేస్తూ విపక్ష రాజకీయాల హక్కులను కాలరాస్తున్నాడని ధ్వజమెత్తారు.మోడీ ప్రభుత్వ విధానాలంతా కార్పొరేట్ అనుకూల విధానాలేనని విమర్శించారు. అందుకే కార్పొరేట్ సంస్థలు అంబానీ, ఆదానీ లకు 150లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిన నీచ ప్రధానిగా నరేంద్రమోదీ చరిత్ర పుటల్లో ఉంటారని విమర్శించారు. ఇదే రాయితీలు దేశ ప్రజలకు ఇస్తే దేశ ప్రగతి మారేదని అన్నారు. మోడీకి దేశ ప్రజలపై ప్రేమ లేదని, కేవలం దేశాన్ని దోచుకునే సంస్థలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు.దేశంలో చిన్న తరహా పరిశ్రమలకు సహాయం చేయని కారణంగా వేలాది పరిశ్రమలు మూతపడ్డాయని,వాటి కారణంగానే దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని విమర్శించారు. అందుకే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని దేశ ప్రజలంతా ఇంటికి పంపే పనిలో నిమగ్నమయ్యారని స్పష్టంచేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ను ఇంటికి పంపినట్లే దేశంలో బీజేపీకి ఘోరీ ఖాయమని విమర్శించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి , సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు,ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ కాప్రా పట్టణ కార్యదర్శి జీ. లక్ష్మీ నారాయణ, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నర్సింహా,నేతలు అశోక్, క్లైమేట్ తదితరులు పాల్గొన్నారు.

---

## నిరంకుశ పాలనను చూసాం, నిర్బంధాల నుంచి విముక్తి పోదాం

**- ఇప్పటి వరకు కేసీఆర్ నిరంకుశ పాలన చూశాం - పదేళ్ల నిర్బంధాల నుండి ఇటీవలే విముక్తి పొందాం - భావ ప్రకటన స్వేచ్ఛ లభించిందనే ఆనందంలో ఉన్నాం - ఇక మీదట తెలంగాణలో ప్రజా పాలన సాగుతుందని ఆశిస్తున్నాను - ఎస్పీ జైల్స్ కన్వీనర్, తెలంగాణ యూనిఫార్మ్డ్ సర్వీసెస్ జేఏసి కొలను వెంకటేశ్వర రెడ్డి**



-కొలను వెంకటేశ్వర రెడ్డి

**తెలంగాణ వీణ :** ప్రభుత్వ పథకాలన్ని అర్హులైన వారందరికీ చేరవలసి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఫలాలు పొందలేని అర్హులైన వర్గాలకు కూడా సంక్షేమం చేరువ కావాలని ఆశిస్తున్నాను. సంక్షేమం అర్హులకు చేర్చడంలో గతంలో జరిగిన పొరపాట్లు, ఉద్దేశపూర్వకమైన అసమానతలు పునరావృత్తం కారాదని ఆశిస్తున్నాను.గత పాలకులు తమ వారికే లబ్ది చేకూర్చారని, తమ జెండా మోసిన వారికే వివిధ పథకాల కింద ఆర్థిక ప్రయోజనం చేకూర్చారనే అప్రతిష్టను మూటగట్టుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ : దళిత బంధు అమలులో జరిగిన అక్రమాలు భవిష్యత్ లో జరగరాదని, పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని కోరుకుంటున్నాను. లంచాలకు తావు లేని, మధ్యవర్తి ప్రమేయం లేని వ్యవస్థ ద్వారా పథకాలు పారదర్శకంగా అమలు జరిపిన నాడే ఇందిరమ్మ రాజ్యం-ఇంటింటా సౌభాగ్యం అనే నానుడికి నిజమైన అర్థం ఇచ్చినవారవుతారని భావిస్తున్నాను. అలాంటి వ్యవస్థ ఏర్పాటు కోసం పాలకులు కార్యనిర్వాహక వ్యవస్థలో నికార్సయిన అధికారులను నియమించుకోవాలని సూచిస్తున్నాను. దళారీ వ్యవస్థ పాలకులను భ్రష్టు పట్టిస్తుంది. అలాంటి వ్యవస్థ గత పదేళ్ల కాలంలో వార్డు స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బలంగా పని చేసింది. ఫలితంగా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాల ఫలితాలను అందించలేక పోయారు. అలాంటి వ్యవస్థను నిర్మూలించడంతో పాటు, అన్నింటా పారదర్శకత పాటించడం వల్లనే ప్రభుత్వ ప్రతిష్ట పెరిగే అవకాశం ఉంటుందని సూచిస్తున్నాను.

## వరంగల్‌లో అంతర్జాతీయ రోబోటిక్ -లైవ్ ఎక్సాటిక్ బర్డ్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** వరంగల్ నగరం లోని ఇస్లామీయ కళాశాల మైదానంలో అంతర్జాతీయ రోబోటిక్ -లైవ్ ఎక్సాటిక్ బర్డ్స్ ఎగ్జిబిషన్ ను తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ చేతులమీదుగా ప్రారంభమెనది.ప్రారంభం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కు దోహద పడే పక్షులు జంతువులను మరియు దేశం లోని విభిన్న సంస్కృతులను ప్రతిబింబించే రకరకాల వస్తువులు ఒకే వేదికపై ఏర్పాటు చేయడం నిజంగా గొప్ప విషయం అని నిర్వాహకులను అభినందించారు ఈ ఎగ్జిబిషన్ ను నగర ప్రజలు సందర్శించి మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పొందాలని సూచించారు.నిర్వాహకులు అస్లాం మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు, ఈ ఎగ్జిబిషన్ లో ప్రత్యేక ఆకర్షణగా ఎక్సాటిక్ లైవ్ బర్డ్స్ 50 రకాల అంతర్జాతీయ రోబోటిక్ పక్షులు మరియు జంతువులు ప్రదర్శనలో ఉన్నాయి అని చెప్పారు అలాగే లేటెస్ట్ టైప్ అమ్యూజ్మెంట్ పార్క్ లో క్రాస్ వీల్, జాయింట్ వీల్,టొరాటొరా డ్రాగన్ ట్రైన్ లతో పాటు 100కు పైగా గృహోపకరణ వస్తువులు స్త్రీ అలంకార మరియు పిల్లల ఆట వస్తువులు రకరకాల రుచికరమైన తిను బండారాలైన డిల్లీ పాపడాలు సిమ్లా మిర్చి చాట్ బండార్ మరియు శీతల పానీయాలు కూడా ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో నజీబ్ ఇమ్రాన్ మేనేజర్లు రాజేంద్రప్రసాద్ ఫిరోజ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ కొక్కుల సతీష్,మండల సురేష్, సయ్యద్ వసీమ్ అజీజ్ మీర్జా మరియు స్థానిక పోలీస్ అధికారులు ఉన్నారు.

## ఇంటర్ బోర్డు కార్యదర్శిగా శృతి ఓజా బాధ్యతల స్వీకరణ



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శిగా, ఇంటర్ విద్య సంచాలకులుగా శృతి ఓజా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్య జెఎసి చైర్మన్, గవర్నర్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మధుసూదన్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు నూతన ఇంటర్ బోర్డు కార్యదర్శిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైతు కల్లాలను సందర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ వీణ/ములుగు:** ఏఐసీసీ మహిళ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడకుల అశోక్,నియోజకవర్గ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయుబ్ ఖాన్ గారి సూచనల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిటమట రఘు గారి ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలోని పాక్స్, జీసీసీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు రైతుల కల్లాలను సందర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిటమట రఘు గారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పరిపాలనలో తరుగు పేరుతో రైతులు పండించిన వరి పంటకు క్వింటాకు 10 కేజీల చొప్పున తరుగు పేరుతో దోపిడికి పాల్పడి రైతులను ఇబ్బందులకు గురి చేసినటువంటి ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తరువు తీయకుండా వడ్లను కొనుగోలు చేయడం.కట్టింగ్లను ఎండ కడుతూ రైతుల అమ్ముకున్నటువంటి ధాన్యాన్ని తక్షణమే సరఫరా చేస్తున్నందుకు ఆనందాన్ని వ్యక్త పరుస్తూ నూతన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నడుచుకుంటూన్నటువంటి వైఖరి విధానానికి రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు , మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, పాక్స్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, టౌన్ అధ్యక్షులు సులేమాన్, మాజీ టౌన్ అధ్యక్షులు తాల్లపెల్లి నరేందర్, ఇర్సవడ్ల కిరణ్, యూత్ మండల అధ్యక్షులు గడ్డల నవీన్, టౌన్ ఉపాధ్యక్షులు మామిడి రాంబాబు ,టౌన్ యూత్ అధ్యక్షులు బండారి లక్కీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డోంగిరి మధుబాబు,అల్లంవారి ఘనపురం సర్పంచ్ పలక చిన్నన్న, చల్పాక సర్పంచ్ చింత సుమతీ రమేశ్, సద్దాం, పెయ్యాల సమ్మయ్య, జనగాం చెన్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ లను అమలు చేయాలి

**తెలంగాణ వీణ/మేడ్చల్ జిల్లా:** జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ లను అమలు చేయాలని మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోతె వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మల్లాపూర్ ఎస్ ఎన్ ఎల్ ఫంక్షన్ హాల్ లో మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోతె వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు జర్నలిస్టుల సంక్షేమంతో పాటు, యూనియన్ ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు, జిల్లాలోని జర్నలిస్టులందరికీ వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పలు తీర్మానాలు చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా అధ్యక్షుడు జి బాలరాజ్ గౌడ్, కార్యదర్శి డి. వెంకట్రామిరెడ్డిలు మాట్లా డుతూ..జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అన్నింటిని నెరవేర్చేందుకు వెంటనే కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులందరికీ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నియోజకవర్గాల వారీగా త్వరలోనే శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించే మార్గాలపై చర్చించడంతో పాటు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నీ కె.వి రంగారెడ్డి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**తెలంగాణ వీణ/కాప్రా:** కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని శ్రీ నాగ పోచమ్మ ఆలయ 2024 సంవత్సర క్యాలెండర్ ను మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నూతన సంవత్సరంలో అందరికి మంచే జరుగాలని ఆకాంక్షించారు. అనుకున్న లక్షాలను నేరవేరే దిశగా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పుల్లూరు సదానందం, సెక్రటరీ వంజరి ప్రవీణ్, కోశాధికారి కొండా పరశురామ్, కాలనీ అధ్యక్షులు సతీష్ రెడ్డి, డీ.రాజు, సాయి పవన్, వీరా రెడ్డి, రాజిరెడ్డి, విజయలక్ష్మి, సంతోషి, లక్ష్మీ, బీఆర్ఎస్ నాయకులు జంపాల్ రెడ్డి, నవీన్ గౌడ్లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ నేత మంచిరెడ్డి, మాజీ కలెక్టర్‌పై కేసు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** బిఆర్ఎస్ నేత, ఇబ్రహీంపట్నం మాజీ ఎంఎల్ఎ మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి ఫిర్యాదు మేరకు మంచిరెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్, మాజీ మున్సిపల్ కమిషనర్ యూసఫ్‌లపై కేసు నమోదయింది.స్రవంతి ఫిర్యాదుతో పోలీసులు నలుగురిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 2019 ఎన్నికల సమయంలో మున్సిపల్ చైర్మన్ పోస్ట్ కోసం తన నుంచి రూ. 2.50 కోట్లు తీసుకున్నారని, అంతేకాకుండా తాను చైర్ పర్సన్‌గా ఎన్నికైనప్పటి నుంచి తనను కులం పేరుతో వేధిస్తున్నారని, సమావేశాలు, సభలలో తనకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా మాట్లాడారని స్రవంతి ఫిర్యాదులో పేర్కొన్నారు. వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించడం కోసం తనను సెలవు పెట్టమని బెదిరించేవారని పేర్కొన్నారు. నాటి కలెక్టర్ కూడా మంచిరెడ్డికి మద్దతుగా తక్కువ కులం వారు, అలాంటి వారితో పెట్టుకోవద్దని తనకు చెప్పారని స్రవంతి తన ఫిర్యాదులో ఆరోపించారు.

## చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను చార్మినార్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 50 కార్టన్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.15లక్షలు ఉంటుంది. పోలీసుల కథనం ప్రకారం.. భగవాన్‌దాస్ బజాజ్, వేణుగోపాల్ బజాజ్ ఇద్దరు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు. బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి నగరంలోని పతంగ్ మహల్, కాళీ కమాన్, గుల్జార్ హౌస్‌లో షాపులు ఏర్పాటు చేసి పతంగులు, దారాలను విక్రయిస్తున్నారు. సంక్రాంతికి చాలామంది పతంగులను ఎగురవేయనున్నారు.దీనికి క్యాష్ చేసుకునేందుకు ఇద్దరు నిందితులు ప్లాన్ వేశారు. దీని కోసం చైనా మాంజాను విక్రయించి డబ్బులు సంపాదించాలని ప్లాన్ వేశారు. నైలాన్ మాంజాకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో దానిని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. చైనా మాంజా పక్షలకు ప్రమాదం కావడంతో దీనిని ప్రభుత్వం నిషేధించింది. దీనిని తీసుకుని వచ్చి పలువురికి విక్రయిస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నారు. ఇన్స్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్సై నవీన్‌కుమార్ తదితరులు పట్టుకున్నారు.



## ప్రజా పాలనలో ఉద్యోగుల పాత్రే కీలకం

**- ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్క**




**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** మంగళవారం నర్సంపేటలో ములుగు నియోజక వర్గం కొత్త గూడ గంగారాం మండలాల కు చెందిన ఆదివాసి సంక్షేమ సాంస్కృతిక సేవ సంఘం పట్టణ కమిటీ నర్సంపేట ప్రభుత్వ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ సందర్భంగా సీతక్క పంచాయితీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా వచ్చిన సందర్భంగా ఉద్యోగులు ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటుంది నేను మీ ఇంటి ఆడబిడ్డ ను మీరు నన్ను ఆదరించి ఆశీర్వదించి ఎమ్మెల్యే గా మంగళవారం మంత్రిగా పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించడం జరిగింది కచ్చితంగా ప్రజలు నాపైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని నన్ను ఆదరించి ఆశీర్వదించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని ఈ ఆత్మీయ సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేసి మిమ్ములందరిని కలిసే అవకాశం కల్పించిన ఆదివాసి సంక్షేమ సాంస్కృతిక సేవ సంఘం నర్సంపేట కి ధన్యవాదాలు తెలుపుతూ ఈ ప్రాంత అభివృద్ధి లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు.

## నాగేంద్ర స్వామీ దేవాలయంలో మొక్కులు చెల్లించుకున్న మంత్రి సీతక్క



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో పంచముఖ నాగేంద్ర స్వామీ దేవాలయం లో మొక్కులు చెల్లించుకున్న పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంత్రికి ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందించారు. మంత్రి వర్యులు సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నానని, ప్రతి గ్రామం మండలంలోని సమస్యలు తెలుసు అని అన్ని సమస్యలను తొలగించి ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామని సంక్షేమ పథకాలు రాష్ట్రములో ప్రతి ఒక్కటి అర్హులైన వారికి అందేలా చూస్తామని ప్రజలకు సుపరిపాలన అందించే విధంగా మా పాలన ఉంటుంది అని సీతక్క అన్నారు.

## బాలిక కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** బాలిక కిడ్నాప్ కేసును బహదూర్‌పుర పోలీసులు ఐదు గంటల్లో ఛేదించారు. బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సౌత్‌జోన్ డిసిపి సాయిచైతన్య తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్, బహదూర్‌పురకు చెందిన నసీం బేగం, ఆయేషా బేగం ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నసీం బేగంకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహం అయి పిల్లలు అయ్యారు. కానీ పెద్ద కూతురు ఆయేషా బేగంకు పిల్లలు పుట్టలేదు. దీంతో నసీం బేగం ఈ నెల 25వ తేదీన కిషన్‌బాగ్ పార్క్‌లో ఏడాదిన్నర బాలికను కిడ్నాప్ చేసింది. బాలికను తీసుకుని వచ్చి కూతురికి అప్పగించింది. అక్కడి నుంచి ఇద్దరు కలిసి కూతురు ఉంటున్న నావాబ్‌సాహెబ్ కుంటకు ఆటోలో బయలు దేరారు. వీరిని పోలీసులు తాడ్‌బన్ ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు బహదూర్‌పుర పోలీసులు మూడు టీములగా ఏర్పడ్డారు. పోలీసులు దాదాపుగా 100 సిసి కెమెరాలు పరిశీలించారు. డిఐ శ్రీశైలం, ఎస్సైలు శ్రీకాంత్, బిక్షం, మల్లారెడ్డి, నర్మదలు పట్టుకున్నారు.



# ఏఐటీయూసీ గెలుపుతోనే సింగరేణికి సంస్థకు మనుగడ

**- సబ్బండ వర్గాలలకు దిక్సూచి సిపిఐ జెండా**
**- చరిత్రగతిని మార్చే శక్తి ఎర్రజెండాకే ఉంది**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా**
**- శేషగిరిభవన్లో ఘనంగా సిపిఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు**




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలిస్తేనే సింగరేణి సంస్థకు కార్మిక వర్గానికి మనుగడ ఉంటుందని సిపిఐ భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా పునరుద్ఘాటించారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం 99వ వ్యవస్థాపక దినోత్సవ కేక్ కట్ చేసిన అనంతరం జరిగిన సదస్సులో సాబీర్ మాట్లాడారు. ఇటీవల సర్కారు సంఘం పాలన పైరవీలతోనే సాగిందని కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకున్న నాధుడే కరువయ్యాడని అన్నారు. కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెట్టడమే సర్కారు సంఘాలు పనిగా పెట్టుకుంటాయని ఇలాంటి సంఘాలు సంస్థకు, కార్మికుల మనుగడకు ప్రమాదకరమని అన్నారు. ఇలాంటి పరిస్థితిలో కార్మికుల పక్షం వహించే ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. సబ్బండ వర్గాలకు సిపిఐ జెండా దిక్సూచి అని సుధీర్ఘపోరాట చరిత్రలో ప్రజలకు కార్మికులకు కర్షలకులకు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే తత్వాన్ని నేర్పింది కమ్యూనిస్టు పార్టీ జెండానేనని మనిషిని మనిషి దోపిడి చేయని సమసమాజ నిర్మాణంకోసం ఆవిర్భవించిన సిపిఐ నాటి నుంచి నేటివరకు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుదూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని అన్నారు. కార్మిక కర్షక ప్రజల కోసం ప్రజా హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టుల సొంతమని పేర్కొన్నారు. పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమాలతో ప్రజా చైతన్యాన్ని రగిలించిన పార్టీ సిపిఐ ఎన్నో త్యాగాలు చేస్తూ బ్రిటీష్ కాలం నుండి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండేందుకు ఏర్పడిందని స్పష్టం చేశారు. చరిత్రగతిని మార్చే శక్తి కేవలం ఎర్రజెండాకే ఉందని నాటి అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాల ఉధృతిని పెంచుతామని స్పష్టం చేశారు. ప్రస్తుత పాలకులు మతోన్మాదాన్ని పెంచొపోషిస్తున్నాయని దేశసంపదను కొల్లగొడుతూ కార్పోరేట్లకు కట్టబెడుతూ దేశాన్ని తిరోగమనంపైపు నెట్టివస్తున్నారని ఈ పరిస్థితిలో ఈ శక్తుల నుండి దేశాన్ని కాపాడుకునే భాద్యతను కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు స్వీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి జిల్లా నాయకులు బందెల నర్సయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగా వెంకట్, భూక్య శ్రీనివాస్, ఎ.కె.ఫహీమ్, కె.రత్నకుమారి, రమణమూర్తి, కిష్టోఫర్, సుధాకర్రెడ్డి, నూనావత్ గోవిందు, గుత్తుల శ్రీనివాస్, యు.హరీష్, ఖయ్యూమ్, జహీర్, భూపేష్, ఎం.సత్యనారాయణ, ధనలక్ష్మి, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తా: మంత్రి సీతక్క



**తెలంగాణ వీణ/ములుగు:** జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న వెనకబడిన మండలాలు కొత్తగూడ, గంగారంల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు.మంగళవారం మంత్రి కొత్త గూడ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ , ఐ.టి.డి.ఏ. పీఓ అంకిత్ తో కలిసి 24 మందికి కల్యాణ లక్ష్మీ షాధి.ముబారక్ లబ్ధిదారులకు చెక్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.రెండు మండలాల్లో త్రాగునీటి కొరత అధికంగా ఉంటున్నందున సమస్యపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్వాడి కేంద్ర భవనాలపై మాట్లాడుతూ మరమ్మత్తులు ఉంటే నిధులు మంజూరు చేస్తానని అన్ని వసతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలోని 14 వేల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తమ దృష్టిలో ఉందని త్వరలోనే భర్తీ చేస్తామని తెలియజేశారు. అదేవిధంగా అంగన్వాడీల వేతనాల పెంపుకు చర్య తీసుకున్నామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ఉండాలని అధికారులకు సూచించారు. నిధులు మంజూరైన చోట త్వరితగతిన పనులు పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజలు బ్యాంక్ అదనపు బ్రాంచి కోరినందున త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలనను అంకిత భావంతో చేపట్టి విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంపై అధికారులకు అవగాహన పరిచామని , తాసిల్దార్లు ఎంపీడీవోలు 2 టీంలు గా ఏర్పడి పర్యటిస్తాయని ప్రతి రోజు 4 గ్రామాలు చొప్పున కవరేజ్ చేయడం జరుగుతుందన్నారు. కొత్తగూడ మండలం ఆరు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు గ్రామపంచాయతీలలో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాలను ఒకరోజు ముందుగానే గ్రామపంచాయతీలో ప్రదర్శింప చేస్తామన్నారు.ఈ కార్యక్రమం పై విస్తృత ప్రచారం చేపడతామని గ్రామ గ్రామాన దండోరా వేయిస్తామన్నారు.ప్రతి దరఖాస్తుకు రసీదు ఇస్తామని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అపోహలకు తావివ్వరాదన్నారు. 28వ తేదీ నుండి జనవరి ఆరవ తేదీ వరకు 8 రోజులపాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరి దగ్గర దరఖాస్తు స్వీకరిస్తామని తెలియజేశారు.ఈ సమీక్ష సమావేశంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ ఎర్రయ్య ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ హేమలత ఇతర అధికారులు ఎంపీపీలు జడ్పిటిసిలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం

**తెలంగాణ వీణ/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలో ములుగు మండల అధ్యక్షులు ఎండి.చాంద్ పాషా గారి ఆధ్వర్యంలో కిసాన్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయగా అట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మరియు ములుగు నియోజకవర్గ కో - ఆర్డినేటర్ గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ విచ్చేసి గత పది సంవత్సరాలుగా రైతు పండించిన పంటను తరుగు పేరుతో దోచుకుంటున్న గత ప్రభుత్వాల నియంత పాలన కూల్చి, తరుగు లేకుండా సన్న ధాన్యానికి క్వింటాలుకు 2200/- రూపాయలు చెల్లించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం, అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే మన రేవంత్ రెడ్డి మరియు సీతక్క చేసిన కృషికి వారి చిత్ర పటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పండించిన పంటను అమ్ముకోలెని దీన స్థితిలో ఉన్నారని, క్వాంట పెట్టిన వడ్లను రవాణా చేయడానికి కూడా వాహనాల సమస్య ఉండేదని, వాహనానికి పదివేల రూపాయలు రైతులు చెల్లిస్తేనే రవాణా సౌకర్యం ఉండేదని, అలాగే రైతు పండించిన పంటను తరుగు పేరుతో దళారులు దోచుకునే వారని అన్నారు. రైతు పండించిన పంటను అమ్మలెని స్థితిలో ఉన్న రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాకుండానే తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతుల పాలిట దైవంలా మారారని అన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మడానికి తరుగు పేరుతో క్వింటాలుకు 10 కిలోల వరకు దోచుకునేవారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తరుగు లేకుండా క్వింటాలుకు 2200/- చెల్లిస్తుండగా, అలాగే బయట కూడా 3000/- రూపాయలకు కూడా కొనుగోలు చేస్తుండడం హర్షణీయం అని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుల ప్రధాన సమస్యను తొలగించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డికి, మన పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క గారికి ధన్యవాదాలు తెలుపుతూ, కిసాన్ కాంగ్రెస్ తరుపున పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కునూర్ అశోక్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి మూసిన పెల్లి కుమార్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనెటి శ్యాం, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి రామకృష్ణరెడ్డి,



కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి చక్రం రాజు, గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడు కర్నే రతన్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడుగ బిక్షపతి గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు జనగాం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వేముల వేణు, గౌడ్ రైతులు పోతిరెడ్డి రాజు, బోళ్ల కనకయ్య, పోతిరెడ్డి సంజీవ, జక్కుల రవి, మైనాల సారయ్య, గంజి కుమార్, వేల్పుల రాజేషు, బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు



తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి: మంగళవారం వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు హాసన్ పర్తి మండలాల పరిధిలోని వివధ విభాగాల సంబంధించిన అధికారులతో ఐనవోలు ఎంపిడిఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా పాలన సంబంధించిన విధివిధానాలను ఐనవోలు హాసన్ పర్తి మండలాల వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి ఎంపీటీసీలు వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ హొటల్‌లో టీ తాగినా మంత్రి



**తెలంగాణ వీణ/వరంగల్ ప్రతినిధి:** ఎన్నికలకు ముందు ప్రచార సమయంలో భాగంగా కాశీబుగ్గ ఏరియా లో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న సుధాకర్ హొటల్ కి వెళ్లి టీ తాగడం జరిగింది ఆరోజు టీ తాగుతూ కొండా సురేఖ మాట్లాడుతూ మళ్లీ ఈ హొటల్ కి ఎన్నిక లలో గెలిచి మంత్రి పదవి హొదాలో మళ్ళీ వస్తానని ఆరోజు హొటల్ యజమానికి మాట ఇవ్వడం జరిగింది ఇచ్చిన మాట ప్రకారం అటవీ,పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి పదవి బాధ్యతలు స్వీకరించి మంగళవారం మళ్లీ అదే హొటల్ కి మర్యాదపూర్వకంగా వెళ్లి యజమానిని కలిసి టీ తాగుతూ ముచ్చటించడం జరిగింది. మంత్రి పదవి బాధ్య తలు స్వీకరించి మొట్టమొదటిసారిగా తమ హొటల్ కు వచ్చిన అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి "కొండా సురేఖను సన్మానించిన హొటల్ యజమాని సుధాకర్ దంపతులు ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
బుధవారం 27 డిసెంబర్ 2023
/ క్రీడలు


# ఒలింపిక్స్ బిడ్ కోసం కసరత్తు..
# అహ్మదాబాద్‌లో ఐదు భారీ స్టేడియాల నిర్మాణం..?

2036లో జరుగబోయే ఒలింపిక్స్‌కు బిడ్ వేయాలని పట్టుదలతో ఉన్న భారత్.. ఆ దిశగా మరో కీలక అడుగు ముందుకేసింది. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాల స్వరాష్ట్రం గుజరాత్‌లో ఒలింపిక్స్‌ను నిర్వహించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అహ్మదాబాద్‌లో ఐదు భారీ స్టేడియాల నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం - గుజరాత్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లుతున్నట్టు సమాచారం. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రధాని మోడీ 2036 ఒలింపిక్ గేమ్స్‌తో పాటు 2030 యూత్ ఒలింపిక్స్‌కు కూడా బిడ్ వేస్తామని అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.ఒలింపిక్స్ నిర్వహణ అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. సుమారు 50 నుంచి 65 దేశాలు పాల్గొనే కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణకే గతేడాది బర్మింగ్‌హామ్ (ఇంగ్లండ్) వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. 2026లో ఈ గేమ్స్‌ను నిర్వహించేందుకు ఆస్ట్రేలియాలోని విక్టోరియానగరం ముందుకొచ్చినా తర్వాత ఖర్చు తడిసి మోపెడవుతుందని భావించి వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. అలాంటిది ప్రపంచపటంలోని దేశాలన్నీ పాల్గొనే ఒలింపిక్స్ నిర్వహణకు ఖర్చు కామన్వెల్త్ కంటే ట్రిపుల్ అయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో మౌళిక సదుపాయాలతో



పాటు ఒలింపిక్స్ ఆడేందుకు అనువైన స్టేడియాలు నిర్మించాలి. తాజాగా అహ్మదాబాద్ అదే ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.అహ్మదాబాద్‌లో ఇప్పటికే లక్షా 30 వేల మంది సీటింగ్ కెపాజిటీ కలిగిన క్రికెట్ (నరేంద్ర మోడీ స్టేడియం) స్టేడియం ఉంది. కానీ ఒలింపిక్స్‌లో వందలాది క్రీడాంశాలను నిర్వహించేందుకు గాను నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఐదు భారీ స్టేడియాలను నిర్మించేందుకు ఇరు ప్రభుత్వాలు (కేంద్ర, రాష్ట్ర) ఇప్పటికే అంగీకారం తెలిపినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. 50వేల మంది సీటింగ్ కెపాజిటీతో ఫుట్‌బాల్ స్టేడియం, 18 వేలు, 10 వేల సీటింగ్ కెపాజిటీతో రెండు ఇండోర్ స్టేడియాలు, ఒక ఆక్వాటిక్ సెంటర్ (స్విమ్మింగ్ క్రీడల కోసం), పదివేల మంది ప్రేక్షకుల సామర్థ్యంతో టెన్నిస్ స్టేడియాన్ని నిర్మించనున్నట్టు తెలుస్తోంది. ఇదివరకే అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అడా) కూడా ఈ మేరకు టెండర్స్ ప్రక్రియను ప్రారంభించినట్టు సమాచారం. స్టేడియాలతో పాటు సబర్మతి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి, సుందరీకరణ పనులు కూడా మొదలుపెట్టనున్నట్టు తెలుస్తోంది.

# సానియా మీర్జా కొడుకు ఐదేళ్లకే మెడల్ సాధించాడు!



తమది క్రీడాకారుల కుటుంబం అని నిరూపించాడు ఆ బుడతడు. ఐదేళ్లకే పతకం సాధించి తల్లితండ్రుల పేరు నిలబెట్టాడు. ఇదంతా ఎవరి గురించి అనుకుంటున్నారా? టెన్నిస్ క్వీన్ సానియా మీర్జా, పాక్ క్రికెటర్ షోయబ్ మాలిక్ ల కుమారుడి గురించే. ఈ దంపతుల ముద్దుల కుమారుడి పేరు ఇజాన్. వయసు ఐదేళ్లు. అయితేనేం? యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో ఇటీవల జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో మెడల్ సాధించి, అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇజాన్ సాధించిన విజయానికి తల్లిదండ్రులు ఉబ్బితబ్బిబ్బయిపోయారు. కుమారుడితో కలసి తీసుకున్న ఫోటోలను నెట్టింట పోస్ట్ చేశారు.షోయబ్, సానియా మీర్జాలకు 2010లో వివాహమైంది. 2018 అక్టోబర్లో వారికి ఇజాన్ పుట్టాడు. అయితే ఆ తర్వాత ఈ దంపతుల మధ్య విభేదాలు వచ్చి విడిపోయారని, ఎవరికి వారు విడివిడిగా ఉంటున్నారని పుకార్లు వెల్లువెత్తాయి. తాజా సంఘటనతో ఆ పుకార్లు వట్టివేనని రుజువైంది.

# అఫ్గాన్ బోర్డు నిర్ణయంపై స్పందించిన నవీన్ ఉల్ హక్..



అఫ్గానిస్తాన్ క్రికెటర్లు నవీన్ ఉల్ హక్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, ఫజల్‌హక్ ఫరూఖీలపై ఆ దేశ క్రికెట్ బోర్డు తీసుకున్న నిర్ణయం ఆ దేశ క్రికెట్ అభిమానులతో పాటు ఫ్రాంచైజీ క్రికెట్ ఫ్యాన్స్‌నూ షాక్‌కు గురిచేసింది. ఈ ముగ్గురూ దేశానికంటే వివిధ దేశాల్లో జరుగుతున్న ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌కే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఆరోపిస్తూ అఫ్గాన్ క్రికెట్ బోర్డు.. ఈ ముగ్గురూ లీగ్‌లలో ఆడకుండా రెండేండ్ల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే అఫ్గాన్ క్రికెట్ బోర్డు నిర్ణయం తర్వాత ఈ ముగ్గురు క్రికెటర్లు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. తాజాగా నవీన్ ఉల్ హక్ మాత్రం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఆసక్తికర పోస్టు చేశాడు.నవీన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో 'ఇది చాలా సాధారణ విషయం. సత్యం నెమ్మదిగా తెలుస్తుంది. కానీ అబద్ధం మాత్రం అగ్ని కంటే వేగంగా వ్యాపిస్తుంది..' అని రాస్తూ అఫ్గానిస్తాన్ దేశపు జెండాతో పాటు లవ్ ఎమోజీలను పెట్టాడు. ఇది అఫ్గాన్ క్రికెట్ బోర్డును ఉద్దేశించి చేసిందేనని నెటిజన్లు చెవులు కొరుక్కుంటున్నారు.

# నా వారసుడిగా అతడైతేనే కరెక్ట్ : వార్నర్



ఆస్ట్రేలియా సీనియర్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఆఖరి టెస్టు సిరీస్ ఆడుతున్న విషయం తెలిసిందే. పాకిస్తాన్‌తో స్వదేశంలో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ తర్వాత టెస్టుల నుంచి తప్పుకుంటానని వార్నర్ భాయ్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వార్నర్ తర్వాత రెడ్ బాల్ క్రికెట్‌లో అతడి స్థానాన్ని భర్తీ చేసేది ఎవరు..? ఎవరైతే ఆ పొజిషన్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తారు..? అన్నదానిపై ఆస్ట్రేలియా క్రికెట్‌లో చర్చోపచర్చలు జరుగుతున్న వేళ వార్నర్ తాజాగా తన వారసుడెవరైతే బాగుంటుందో వెల్లడించాడు.మెల్‌బోర్న్ వేదికగా పాకిస్తాన్‌తో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టు సందర్భంగా తొలి రోజు ఆట ముగిసిన తర్వాత వార్నర్ స్పందిస్తూ.. 'అది చాలా కష్టం. ఆ విషయంలో తుది నిర్ణయం సెలక్టర్లదే. కానీ నా అభిప్రాయం ప్రకారం అయితే ఆ ఛాన్స్ హ్యారీ (మార్కస్ హారీస్) కి ఇస్తాను. అతడు ఇటీవల కాలంలో అద్భుత ప్రదర్శనలతో రాణిస్తున్నాడు. అతడికి ఆ అవకాశం దక్కాలి. పాకిస్తాన్‌తో విక్టోరియా లెవన్ ఆడిన మ్యాచ్‌లో హ్యారీ సెంచరీ కూడా చేశాడు. అతడికి సరైన అవకాశాలు రాకపోవచ్చు గానీ నా తర్వాత నా ప్లేస్‌ను అతడు భర్తీ చేస్తే బాగుంటుందని నేను అనుకుంటున్నా. ఒకవేళ సెలక్టర్లు అతడి మీద నమ్మకముంచితే అతడు తనను తాను నిరూపించుకుంటాడు' అన అన్నాడు.

# వినేశ్ ఫోగాట్ సంచలన నిర్ణయం.. ఆ రెండు అవార్డులూ వాపస్..

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆమె కేంద్ర ప్రభుత్వం తనకు అందజేసిన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న‌తో పాటు అర్జున అవార్డులను వాపస్ ఇచ్చేస్తున్నట్టు తెలిపింది. కొద్దిసేపటి క్రితమే ఆమె ఎక్స్ (ట్విటర్) వేదికగా తన నిర్ణయాన్ని ప్రకటించింది. ట్విటర్‌లో ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాస్తూ.. 'నేను నా ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వాపస్ ఇచ్చేస్తున్నా' అని అందులో పేర్కొంది. బజరంగ్ పునియా తర్వాత అవార్డును ప్రభుత్వానికి తిరిగిచ్చేసిన రెజ్లర్ల జాబితాలో ఫోగాట్ రెండో క్రీడాకారిణి. బధిరుల ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు నెగ్గిన విజేందర్ సింగ్ కూడా సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకున్నాక తన అర్జున అవార్డును వాపస్ ఇచ్చేస్తానని ప్రకటించినా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో అతడు దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన పరిణామాలతో పలువురు రెజ్లర్లు తీవ్ర కలత చెందిన విషయం తెలిసిందే. ముఖ్యంగా డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ గెలుపొందిన వెంటనే సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించగా బజరంగ్ పునియా తన అర్జున అవార్డును వెనక్కిచ్చేశాడు. ఈ పరిణామాలతో అలర్ట్ అయిన కేంద్రం.. సంజయ్ సింగ్ ప్యానెల్‌ను సస్పెండ్ చేసింది. రెండు రోజుల క్రితమే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కూడా తనకు రెజ్లింగ్‌తో ఏం సంబంధం లేదని, ఈ ఆటకు ఇక సెలవు అని కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌ను తప్పిస్తే ఈ అంశం చల్లారుతుందని భావించినా వినేశ్ ఫోగాట్ తాజా ప్రకటనతో ఈ చిచ్చు ఇప్పట్లో ఆరేలా లేదని తెలుస్తున్నది.



# ఐదేసిన రబాడ.. 28 ఏండ్లకే అరుదైన రికార్డు..
## తొలి ఇన్నింగ్స్‌లో ఎదురీదుతున్న భారత్




సఫారీ పేసర్ కగిసో రబాడా ఐదు వికెట్లతో విజృంభించడంతో సెంచూరియన్ వేదికగా జరుగు తున్న తొలి టెస్టులో భారత్ ఎదురీదుతోంది. సెంచూరియన్‌లోని సూపర్‌స్పోర్ట్ పార్క్ వేదికగా జరుగు తున్న తొలి టెస్టులో టాస్ ఓడి మొదట బౌలింగ్ చేసిన సౌతాఫ్రికాకు వరుస బ్రేకులిస్తున్న రబాడా.. రోహిత్, విరాట్, శ్రేయస్ వంటి స్టార్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. రబాడ విజృంభణతో టీ విరామానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లు ముగిసేసరికి ఏడు వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (39 బ్యాటింగ్), బుమ్రా (0 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

### రబాడా అరుదైన ఘనత..

సౌతాఫ్రికా పేసర్ రబాడా ఐదు వికెట్లు తీయడంతో పాటు మరో అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సౌతాఫ్రికా తరఫున ఐదు వందల వికెట్లను పూర్తిచేసుకున్నాడు. సౌతాఫ్రికా తరఫున ఈ ఘనత సాధించిన బౌలర్లలో రబాడా ఏడో స్థానంలో ఉన్నాడు. షాన్ పొలాక్ (823), డేల్ స్టెయిన్ (697), ముఖయా ఎన్తిని (661), అలెన్ డొనాల్డ్ (602), జాక్వస్ కలిస్ (572), మోర్నీ మోర్కెల్ (535) తర్వాత రబాడ ఉన్నాడు.

# వర్షం అంతరాయం.. ముగిసిన తొలిరోజు ఆట



భారత్-దక్షిణాఫ్రికా మధ్య సెంచూరియన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో వర్షం మరోసారి అంతరాయం కలిగించింది. మొదటి టెస్టు తొలి రోజు ఆటలో భాగంగా టాస్‌కు ముందు ఓసారి వర్షం కురవగా తాజాగా టీ తర్వాత మరోసారి వరుణుడు ఆటకు అంతరాయం కలిగించాడు. వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోయే సమయానికి భారత్.. 59 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (105 బంతుల్లో 70 నాటౌట్, 10 ఫోర్లు, 2 సిక్సర్లు), సిరాజ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సఫారీ పేసర్ ఐదు వికెట్లతో విజృంభించడంతో భారత టాపార్డర్ విఫలమైంది.టీ విరామానికి 40 పరుగులతో ఉన్న రాహుల్.. బర్గర్ వేసిన 52వ ఓవర్లో ఫోర్, సిక్సర్ బాది అర్థ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 19 బంతులాడి ఒక్క పరుగు మాత్రమే చేసిన బుమ్రాను మార్కో జాన్సెన్.. 55వ ఓవర్లో మూడో బంతికి ఔట్ చేశాడు. గెరాల్డ్ కొయెట్జ్ వేసిన 58వ ఓవర్లో రాహుల్.. వరుసగా రెండు బౌండరీలు బాదాడు. దీంతో భారత స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. జాన్సెన్ వేసిన 59వ ఓవర్లో ఐదో బంతికి బౌండరీ కొట్టడంతో అతడు 70లలోకి వచ్చాడు. అయితే అదే ఓవర్లో వర్షం కురవడం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను తాత్కాలికంగా వాయిదా వేశారు.

### ముగిసిన తొలి రోజు ఆట..

టీ విరామం తర్వాత 9 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా వర్షం కురవడంతో పాటు వెలుతురు సరిగా లేకపోవడంతో అంపైర్లు తొలి రోజు ఆటను నిలిపేశారు. మొదటి రోజు 59 ఓవర్లు మాత్రమే సాధ్యమయ్యాయి. భారత టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (5), యశస్వి జైస్వాల్ (17), శుభ్‌మన్ గిల్ (2)లు దారుణంగా విఫలం కాగా విరాట్ కోహ్లీ (38), శ్రేయస్ అయ్యర్ (31)లు ఫర్వాలేదనిపించారు. శార్దూల్ ఠాకూర్ (24) తనవంతు చేయి వేశాడు. కెఎల్ రాహుల్ నిలదొక్కుకోవడంతో భారత్ 200 పరుగులైనా చేయగలిగింది.

# నీతో మాట్లాడనీకుండా బ్లాక్ చేసేశారు.. కుమారుడి బర్త్‌డే సందర్భంగా ధావన్ ఎమోషనల్ పోస్ట్

కుమారుడి పుట్టినరోజు సందర్భంగా భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఎమోషనల్ పోస్ట్ చేశాడు. 'నిన్ను చూసి ఏడాది అవుతోంది' అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మేరకు ఇటీవలే తన కుమారుడితో వీడియో కాల్ మాట్లాడిన ఫొటోను ఇన్‌స్టా వేదికగా షేర్ చేస్తూ ఉద్వేగానికి లోనయ్యాడు. కుమారుడితో మాట్లాడనివ్వకుండా అన్ని విధాలా తనను బ్లాక్ చేసినట్లు ఆవేదనకు గురయ్యాడు.'నేను నిన్ను ప్రత్యక్షంగా చూసి ఏడాది అయిపోయింది. దాదాపు మూడు నెలలుగా నీతో మాట్లాడనివ్వకుండా అన్ని విధాలుగా నన్ను బ్లా చేసేశారు. నాకు నిన్ను పూర్తిగా దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నేను నీతో నేరుగా మాట్లాడలేకపోయినప్పటికీ.. టెలీపతితో ఎప్పటికీ నీ మనసుకు దగ్గరగానే ఉంటాను. ఈ పాపా ఎప్పుడూ నిన్ను మిస్ అవుతాడు. ప్రేమిస్తూనే ఉంటాడు. నువ్వు ఉన్నతంగా ఎదగాలి. గొప్పగా రాణించాలి. దేవుడి దయ వల్ల మళ్లీ మనం కలుస్తామని ఆశిస్తున్నా. ఆ సమయం కోసం చిరునవ్వుతో ఎదురు చూస్తూనే ఉంటా. ధైర్యంగా, సంతోషంగా ఉండు. హ్యాపీ బర్త్‌డే జొరావర్.. లవ్ యూ' అంటూ పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.




## ప్రేక్షకులను ఫిదా చేస్తున్న.. ఈ 'సలార్' నటి ఎవరో తెలుసా?



శ్రియా రెడ్డి.. ఇప్పుడీ పేరుపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అందుకు కారణం లేకపోలేదు.. ఇటీవల విడుదలై ఇండియన్ భాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్స్ కొల్లడుతున్న సలార్ మూవీలో శ్రియా రెడ్డి నటించడమే. ఈ మూవీ చూసిన వారంతా ఈమె గురించే మాటా్లడుకుంటున్నారు. ఈ సినిమాలో రాధా రామగా తన నటనతోపాటు ఆమె వేషాధారణ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో పాత్రకు తగ్గట్లు.. శ్రియా రెడ్డి కాస్ట్యూమ్స్ ప్రత్యేకంగా డిజైన్ చేయించారు మేకర్స్. బాహుబలిలో రమ్యకృష్ణ పోషించిన పాత్రకు ఎంత పేరొచ్చిందో మనందరికీ తెలిసిందే. సలార్ లోనూ ఆ స్థాయి నటన, ఆహాభావాలతో సూపర్‌గా నటించిందని.. మరో శివగామిగా ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది ఈ నటి. దీంతో ఇంతకీ ఈమె ఎవరని గూగుల్ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్స్.శ్రియా రెడ్డి విషయానికి వస్తే.. మాజీ భారత తెలుగు క్రికెటర్ భరత్ రెడ్డి కూతురే.. ఈ శ్రియా రెడ్డి. కెరీర్ మొదట్లో యాంకర్, విజెగా పనిచేశారు. ఎస్.ఎస్.మ్యూజిక్ అనే చానల్లో వీడియో జాకీగా పనిచేసేవారు శ్రియా.. 2002లో హీరో విక్రమ్ నటించిన సమురాయ్ అనే తమిళ సినిమాతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత పలు తమిళ సినిమాల్లో నటించింది. తమిళ స్టార్ హీరో విశాల్ పొగరు సినిమాలో లేడీ విలన్‌గా అదరగొట్టింది. విశాల్ సోదరుడు విక్రమ్ కృష్ణతో ప్రేమలో పడి.. పెళ్లి చేసుకుంది. సినిమాలకు దూరమైన శ్రియారెడ్డి ఓటీటీలో వచ్చిన సుడల్ అనే వెబ్ సిరీస్ లో నటించింది.

## కోట్లు కొల్లగొడుతున్న సలార్..

### - మూడు రోజుల్లో వసూళ్లు ఎంతంటే..!



పాన్ ఇండియా మూవీ సలార్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్, రెబెల్ స్టార్ ప్రభాస్ ల కాంబినేషన్ లో వచ్చిన సలార్ ఊహించని స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. డిసెంబర్ 22న విడుదలైన ఈ సినిమా మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లు వసూలు చేసింది. ఇండియాలో 250 కోట్ల రూపాయల మార్క్ ని దాటింది. హెూంబలే ఫిల్మ్ రూ. 400 కోట్ల ఖర్చుతో సలార్ నిర్మించగా, మూడు రోజుల్లోనే పెట్టుబడి తిరిగి రావడం విశేషం.వచ్చే ఏడాది సలార్ కు సీక్వెల్ షూటింగ్ మొదలుకాబోతోంది. దీనికి సలార్–శౌర్యాంగపర్వం అని పేరు పెట్టారు. తారాగణాన్ని ఎంపిక చేసుకుని, షూటింగ్ మొదలుపెట్టడమే తరువాయి. మొదటి పార్ట్ కంటే, రెండో పార్ట్ ఇంకా బాగుంటుందని స్వయంగా ప్రభాసే ప్రకటించడంతో అభిమానులు సంతోషంగా ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

## న్యూయార్క్ వీధుల్లో హీరో విశాల్.. పక్కన ఆ అమ్మాయి ఎవరు?



హీరో విశాల్ న్యూయార్క్ వీధుల్లో సరదాగా నడుస్తూ వెళ్తుండగా ఎవరో అభిమాని వీడియో తీసి, నెట్లో పోస్ట్ చేశాడు. అయితే విశాల్ ఒక్కడే లేడు.. పక్కన ఓ అమ్మాయి కూడా ఉంది. ఇద్దరూ చెట్టపట్టాల్ వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారు. అయితే ఆ అమ్మాయి మొహం కనిపించలేదు. విశాల్ ను చూసిన ఓ అభిమాని.. హలో విశాల్ అని పిలిచాడు. అంతే, విశాల్ వెంటనే తన వేసుకున్న హూడీని పైకి లాక్కుని, అమ్మాయితోపాటు పరుగులాంటి నడకతో వెళ్లిపోయాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.అయితే ఇదంతా పబ్లిసిటీ స్టంట్ లో భాగమని కొందరు కొట్టి పారేస్తున్నారు. క్రిస్మస్ వేడుకల కోసం విశాల్ ఇలా ప్లాన్ చేశాడని కొందరు, తన కొత్త సినిమా ప్రమోషన్ లో భాగమని ఇంకొందరు కామెంట్లు పెడుతున్నారు.

## అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ మూవీ



ఇప్పుడు బాలీవుడ్‌లో అట్లీ పేరు మారుమోగిపోతోంది. కింగ్ ఖాన్ షారుఖ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో వచ్చిన జవాన్ సంచలన విజయం సాధించడంతో అందరి దృష్టి అట్లీ మీద పడింది. తాజాగా జవాన్ వెయ్యి కోట్ల మార్కు దాటింది. అయితే అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఒక మూవీ రానున్నట్లు రూమర్లు చక్కర్లు కొడుతున్నాయి. దీనికి కారణం లేకపోలేదు.జవాన్ తర్వాత కొన్ని రోజులు విశ్రాంతిగా గడిపిన అట్లీ తదుపరి మూవీ కోసం ప్లానింగ్ మొదలుపెట్టినట్లు వినికిడి. ఇందులో భాగంగానే ఆయన స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ని సంప్రదించినట్లు తెలిసింది. వీరిద్దరి మధ్య చర్చలు కొనసాగుతున్నా, ఎవరూ పెదవి విప్పడం లేదు. జనవరి నెలాఖరులో దీనిపై ఒక ప్రకటన రావచ్చని భావిస్తున్నారు. అన్నీ అనుకున్నట్టే జరిగితే, పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ చేపట్టబోయే మూవీ ఇదే కావచ్చునని తెలుస్తోంది. కాగా అట్లీ గత రెండు నెలలుగా కండల వీరుడు సల్మాన్ ఖాన్ తోనూ టచ్ లో ఉంటున్నట్లు సమాచారం.

## ప్రియుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రకుల్



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ టాలీవుడ్‌లో తెలియని వారు అంటూ ఉండరు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాలో నటించి మంచి పేరు తెచ్చుకుంది. తెలుగులో కెరటం సినిమాలతో సినీ ప్రయాణం ప్రారంభించి సరైనోడు, నాన్నకు ప్రేమతో, ధృవ, కిక్–2లాంటి సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. రకుల్ తన భాయ్ ఫ్రెండ్‌తో దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీతో గత కొన్ని రోజుల నుంచి ఆమె సహజీవనంలో ఉన్నారు. జాకీ భగ్నానీ జన్మదినం కావడంతో తన ఇన్‌స్టాగ్రామ్‌లో శుభాకాంక్షలు తెలిపింది. మీ జీవితంలో ప్రతీ రోజు అనుకున్నవి అన్నీ జరగాలని కోరుకుంటున్నానని, నీలాంటి అమాయకత్వం, దయ, నవ్వించే గుణం ఎవరిలో ఉండదేమోనని ప్రశంసించారు. 2009లో కల్ కిస్నే దేఖా సినిమాలో బాలీవుడ్‌లో జాకీ ప్రవేశించారు. జాకీ హీరో, నిర్మాత, వ్యాపార వేత్తగా రాణిస్తున్నారు.

## రామ్ చరణ్, ఉపాసనల కూతురు క్లింకార ఫోటోలు వైరల్!

రామ్ చరణ్, ఉపాసన దంపతులకు ఈ ఏడాది జూన్ 20న కూతురు పుట్టిన సంగతి తెలిసిందే. ఆమెకు క్లింకార అని పేరు పెట్టిన రామ్ చరణ్ దంపతులు.. అప్పటినుంచి తన కుమార్తెను కెమెరాల కంట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాజాగా క్రిస్మస్ సెలెబ్రేషన్స్ కి రామ్ చరణ్ దంపతులు ముంబయికి వెళ్లారు. తమ వెంట కూతుర్ని కూడా తీసుకెళ్లారు. ఫోటోగ్రాఫర్లు వెంటపడటంతో కూతురు మొహం కనిపించకుండా రామ్ చరణ్ జాగ్రత్తలు తీసుకున్నారు. ఉపాసన తమ పెంపుడు కుక్క రైమ్ ను ఎత్తుకోగా, క్లింకారను రామ్ చరణ్ ఎత్తుకుని ఫోటోలకు పోజులిచ్చారు. ఈ ఫోటోలను స్వయంగా ఉపాసనే సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం విశేషం.



## బిగ్ బాస్ నిర్వాహకులకు పోలీసుల నోటీస్





బిగ్ బాస్ నిర్వాహకులకు పోలీసులు నోటీసు జారీ చేశారు. డిసెంబర్ 16న విజేతను ప్రకటించిన అనంతరం చెలరేగిన అల్లర్లకు సంబంధించి ఈ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. డిసెంబర్ 16వ తేదీ రాత్రి, బిగ్ బాస్ ఫైనలిస్టుల అభిమానులు రెండు వర్గాలుగా చీలిపోయి, అన్నపూర్ణ స్టూడియోస్ వెలుపల విధ్వంసానికి దిగిన సంగతి తెలిసిందే. వారి దాడిలో ఐదు ఆర్టీసి బస్సు లు, ఓ పోలీస్ వాహనం, కొన్ని ప్రైవేట్ కార్లు ధ్వంసమయ్యాయి. రన్నరప్ గా నిలిచిన అమర్ దీప్ చౌదరి కారు ధ్వంసమైనా, అదృష్టవశాత్తూ అతను ఎలాంటి గాయాలు తగలకుండా తప్పిం చుకు న్నాడు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు తమ లాఠీలకు పని చెప్పాల్సివచ్చింది. ఈ కేసు కు సంబంధించి పోలీసులు బిగ్ బాస్ ఫైనల్ విజేత పల్లవి ప్రశాంత్ ను, అతని సోదరుడు మహావీర్ తోపాటు మరికొ ందరని కూడా అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ప్రశాంత్, మహావీర్ లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.



## క్రిస్మస్ వేడుకల్లో రామ్ చరణ్, అల్లు అర్జున్ కుటుంబాలు

**రామ్ చరణ్, అల్లు అర్జున్ కుటుంబాలంతా కలసి క్రిస్మస్ పండుగను సరదాగా, వేడుకగా జరుపుకున్నారు. కొత్తగా పెళ్లయిన వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠీ జంట, సాయి ధర్మతేజ్, వైష్ణవ్ తేజ్, నిహారిక, తదితరులంతా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి**

## వ్యూహం సినిమాపై స్టేకు హైకోర్టు నిరాకరణ... లిరికల్ సాంగ్ విడుదల



**హైదరాబాద్:** వ్యూహం సినిమాపై స్టేకు హైకోర్టు నిరాకరించింది. వ్యూహం సినిమాపై స్టే ఇవ్వాలన్న పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ సినిమా విడుదలపై స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. వ్యూహం చిత్రానికి సెన్సార్ బోర్డు యు సర్టిఫికెట్ ఇచ్చింది. వ్యూహం సినిమా నుంచి జగనన్న లిరికల్ వీడియో విడుదల చేశారు. ఈ నెల 29న వ్యూహం సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు.

రిపోర్టర్లు కావలెను
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
S9 TV తెలుగు
తెలుగు లో రాయగల సమర్ధత ,
సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ వీణ తెలుగు దినపత్రిక
మీకు సరైన వేదిక
అన్నీ జిల్లాలు , మండలాలు, నియోజకవర్గాల పరిధిలో
పని చేసేందుకు అవకాశం కలిపిస్తోంది.
వివరాల కొరకు సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్ లు
email: telanganaveenaofficial@gmail.com
Website: https://telanganaveena.com/
91 90525 22626
91 98485 99616

Published and Printed by Vulloju Srinivas on Behalf of Sri Veena Publications Printed at Telangana Veena Flat N0: 204 Mythri Apartments,Opp Bsnl Office Ecil,Kapra,Med Responsible for Selection of News Under the PRB ACT, Phone number: 040 35668720,RNI Reg N0.TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written